సోమవారం
MONDAY
19-10-2026

జగిత్యాల JAGITIAL | పేజీలు:8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00

సంపుటి: Volume:2 | సంచిక: Issue: 111

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

నేటి ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com





వర్సిటీల్లో 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

7 వర్సిటీల్లో భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం

హైదరాబాద్, అక్టోబర్ 18 (ఈవార్తలు): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో బోధనా సిబ్బంది కొరతను తీర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏడు ప్రముఖ విశ్వవిద్యాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న మొత్తం 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అధికారికంగా ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజా నియామకాల ద్వారా ఉస్మానియా, తెలంగాణ, తెలుగు, శాతవాహన, పాలమూరు, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయాలతో పాటు మరొక యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ సంబంధిత యూనివర్సిటీలు త్వరలోనే అధికారిక నోటిఫికేషన్లు విడుదల చేయనున్నాయి. అకడమిక్ మెరిట్, రిసెర్చ్ పబ్లికేషన్స్, ఇంటర్వ్యూలలో ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరగనుంది. సుదీర్ఘకాలంగా ఖాళీల భర్తీ కోసం ఎదురుచూస్తున్న పీహెచ్‌డీ, నెట్, స్లెట్ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రభుత్వ నిర్ణయం ఎంతో ఊరటనిచ్చింది.



డొక్కు బస్సులు

పండగ వేళ ప్రయాణికులకు చార్జీల మోత

స్పెషల్ పేరుతో సిటీ బస్సుల వాడకం

అదనంగా 50 శాతం సర్‌చార్జి.. సామాన్యుల జేబులకు చిల్లు

పండగ వచ్చిందంటే చాలు.. సొంతూళ్లకు వెళ్లాలనే ఆనందం ఒకవైపు.. ప్రయాణ ఖర్చుల భారం మరోవైపు! బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా తెలంగాణలో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఆర్టీసీ బస్సు చార్జీలు భారంగా మారాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పండగ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని చెబుతున్న ఆర్టీసీ.. సాధారణ బస్సులనే ప్రత్యేక సర్వీసులుగా నడుపుతూ అధిక చార్జీలు వసూలు చేస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బస్సుల రూపురేఖలు, సౌకర్యాల్లో పెద్దగా మార్పులేక పోయినా.. టికెట్ ధరల్లో మాత్రం భారీ పెరుగుదల కనిపిస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

(ఈవార్తలు – గ్రౌండ్ రిపోర్ట్)

పండగల సమయంలో ప్రయాణికుల రద్దీ పెరగడం సహజం. ఈ రద్దీని తట్టుకునేందుకు అదనపు బస్సులు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఆర్టీసీపై ఉంటుంది. అయితే, ప్రత్యేక బస్సుల పేరుతో సాధారణ సర్వీసులనే నడుపుతున్నారన్న విమర్శలు ప్రయాణికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. పాత బస్సులు, పరిమిత సౌకర్యాలతోనే ప్రయాణించాల్సి వస్తుండగా, వాటికి ప్రత్యేక సర్వీసుల చార్జీలు వసూలు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ రోజుల్లో అందుబాటులో ఉండే బస్సులనే పండగ ప్రత్యేక సర్వీసులుగా చూపించి అదనపు ఆదాయం పొందుతున్నారా? నిజంగానే కొత్తగా బస్సులను సమకూర్చి ప్రయాణికులకు తరువాయి 2 వ పేజీలో...





మళ్లొచ్చే ఏడు చాందమామ.. పోయిరావమ్మ బతుకమ్మా..!


ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై వేడుకలు

పాల్గొన్న తెలంగాణ కోడలు రష్మిక మందన్నా

హైదరాబాద్, అక్టోబర్ 18 (ఈవార్తలు): తెలంగాణ వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబురాలు ఘనంగా సాగాయి. హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్‌పై భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ట్యాంక్‌బండ్ అమరవీరుల స్మారకం నుంచి మహా బతుకమ్మ ర్యాలీ నిర్వహించారు. 700 మంది కళాకారులు, 600 మందికిపైగా మహిళలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ట్యాంక్ బండ్‌పై ఆటపాటలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, సినీనటుడు విజయ్ దేవరకొండ-రష్మిక దంపతులు పాల్గొన్నారు. ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ వేడుకల్లో ఫైర్‌వర్క్స్, లేజర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ అందరికీ దసరా, సద్దుల తరువాయి 2 వ పేజీలో...

ఫ్రాన్స్ ఆగమాగం



పెచ్చరిల్లిన హింసాత్మక నిరసనలు

143 ఏళ్ల చారిత్రక భవనానికి నిప్పు

1200 మంది అరెస్ట్, 150 మంది పోలీసులకు గాయాలు

హింసకు తావులేదు: ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్

వలస విధానాల వల్లే హింస: అమెరికా

పారిస్: ముసుగులు ధరించిన కొందరు ఆందోళనకారులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు. మంటల కారణంగా భవనం పైకప్పు పూర్తిగా కూలిపోయిందని, బయటి భాగంలో మూడింట రెండొంతులు నాశనమైందని వెల్లడించారు. ఇది దేశ వారసత్వ సంపదకు జరిగిన ఘోర విపత్తు అని స్థానిక ప్రిఫెక్ట్ మారిస్ బరేట్ ఆవేదన వ్యక్తం చేశారు. దుండగులు ఉద్దేశపూర్వకంగానే ఈ దాడికి పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు. దేశంలో పెరుగుతున్న జీవన వ్యయం, పాఠశాలల్లో పరిస్థితులకు వ్యతిరేకంగా లక్షలాది మంది మొదట శాంతియుతంగా ప్రదర్శనలు చేపట్టారు. అయితే, పారిస్‌తో పాటు తరువాయి 2 వ పేజీలో...

6 ఫ్రాన్స్‌లో పెరుగుతున్న జీవన వ్యయానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు హింసాత్మకంగా మారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. ఈ ఆందోళనల్లో భాగంగా 143 ఏళ్ల నాటి చారిత్రక లిమోజెస్ టౌన్ హాల్ భవనానికి ఆందోళనకారులు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో భవనం చాలా వరకు ధ్వంసమైంది. ఈ భవనానికి 1873లో నిర్మాణం ప్రారంభం కాగా, 1883లో అధికారికంగా ప్రారంభించడం జరిగింది. ఈ భవనం ఫ్రాన్స్‌లో చారిత్రక కట్టడంగా గుర్తింపు పొందింది.



బానిసలు అనడం నా తప్పే

హెచ్-1బీ వ్యాఖ్యలపై జేడీ వాన్స్ పశ్చాత్తాపం

హెచ్-1బీ వీసాదారులను 'ఇండెంచర్డ్ సర్వెంట్స్' (ఒప్పంద బానిసలు) అని సంబోధిస్తూ తాను చేసిన వ్యాఖ్యలపై అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ వెనక్కి తగ్గారు. తన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో ఆ పదప్రయోగం సరికాదని అంగీకరించారు. తన విమర్శ ఉద్యోగులను ఉద్దేశించి కాదని, అమెరికా కంపెనీలు అనుసరిస్తున్న వీసా విధానాలను లక్ష్యంగా చేసుకుని మాత్రమే అని స్పష్టం చేశారు. భారత్ నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో ఆయన ఈ మేరకు వివరణ ఇచ్చారు.

వాషింగ్టన్: సీబీఎస్ నిర్వహించిన ఒక టౌన్‌హాల్ కార్యక్రమంలో జేడీ వాన్స్ మాట్లాడుతూ.. "నా మాటలు సరైనవి కావు, ఆ తప్పు నాదే" అని అంగీకరించారు. అమెరికన్లతో భర్తీ చేయలేని ఉద్యోగాలని చెప్పి, విదేశీ నిపుణులను నియమించుకుంటున్న కంపెనీల గురించే తాను మాట్లాడానని వివరించారు. వీసాపై ఆధారపడి పనిచేయడం వల్ల ఉద్యోగులు యాజమాన్యాల చేతిలో శక్తిహీనులుగా మారుతున్నారని, ఉద్యోగం పోతే తమ దేశానికి తిరిగి వెళ్లాల్సి వస్తుందన్న భయంతో -2 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

(గ్రాము-24 క్యారెట్స్):	రూ.14766
వెండి (కిలో):	రూ.2,45,000
ప్లాటినం (గ్రాము):	రూ.4,965

విశ్వవాణి



చైనాలోని నగరాల్లో భారీ ప్రకటన తెరలపై సినీ తారలు, ప్రముఖుల చిత్రాలకు బదులుగా ప్రపంచాన్ని మార్చిన శాస్త్రవేత్తల చిత్రాలు దర్శనమిస్తున్నాయి. రాకెట్ శాస్త్రవేత్త చియాన్ హ్యూసెన్, నోబెల్ పురస్కార గ్రహీత తు యూయూ, వ్యవసాయ శాస్త్రవేత్త యువాన్ లాంగ్‌పింగ్ వంటి ప్రముఖుల చిత్రాలు ఈ ప్రదర్శనల్లో చోటు చేసుకున్నాయి. వారి ఆవిష్కరణలు, పరిశోధనలు, సమాజానికి చేసిన సేవలను ప్రజలకు పరిచయం చేస్తున్నారు. వినోదం, ప్రముఖుల ప్రచారానికి కేటాయించే స్థాయిలోనే విజ్ఞానం, విద్య, నూతన ఆవిష్కరణలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నది ఈ ప్రయత్నం వెనుక ఉన్న ఉద్దేశం. శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకునేలా యువతను ప్రోత్సహించవచ్చని ఈ కార్యక్రమానికి మద్దతు ఇస్తున్నవారు భావిస్తున్నారు.



మృత్యు ట్రక్కు

మధ్యప్రదేశ్‌లో భక్తులపైకి దూసుకెళ్లిన భారీ ట్రక్కు.. 12 మంది మృతి..పలువురికి గాయాలు

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. భక్తులపైకి ట్రక్కు దూసుకెళ్లడంతో 12 మంది దుర్మరణం చెందారు. 39 మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన గ్వాలియర్ జిల్లాలో శీతలా మాత ఆలయం వద్ద శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈప్రమాదంలో భక్తులు అక్కడికక్కడే మరణించారు. స్థానికులు, గ్వాలియర్ ఎస్పీ ధర్మవీర్ సింగ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ క్రమంలో చిన్నిర్ వైపు నుంచి వడ్ల లోడుతో వస్తున్న ఒక వస్తున్న భారీ ట్రక్కు అదుపు తప్పి భక్తులపైకి దూసుకెళ్లడంతో 12 మంది అక్కడికక్కడే మృతి చెందారు. ఆ మార్గంలో భారీ వాహనాల ప్రవేశంపై నిషేధం ఉన్నప్పటికీ, లారీ అక్కడున్న పోలీస్ బారికేడ్లను, చెక్‌పోస్టును బద్దలుకొట్టుకుంటూ వేగంగా దూసుకొచ్చిందని స్థానికులు తెలిపారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న భక్తులను తొక్కుకుంటూ వెళ్లడమే కాకుండా, శీతలా మాత ఆలయ తరువాయి 2 వ పేజీలో...

562 మందిపై హత్యాయత్నం కేసులు..?

పులివెందులలో ఘర్షణల నేపథ్యంలో నిర్ణయం!

ఏపీలోని పులివెందులలో చోటుచేసుకున్న ఘర్షణలు, పోలీసులపై దాడుల ఘటనను పోలీసులు తీవ్రంగా పరిగణించారు. ఈ వ్యవహారంలో నిందితులపై చర్యలను ముమ్మరం చేస్తూ పెద్ద సంఖ్యలో కేసులు నమోదు చేశారు. రాఘవరెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, కిశోర్‌లతో పాటు మొత్తం 562 మందిపై అల్లర్లు సృష్టించడం, హత్యాయత్నం వంటి అభియోగాల కింద కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి ఘర్షణలకు దారితీసిన పరిస్థితులు, దాడుల్లో పాల్గొన్న వారి పాత్ర, జరిగిన నష్టం వంటి అంశాలపై పోలీసులు దృష్టి సారించారు.



పులివెందుల, అక్టోబర్ 18 (ఈవార్తలు): శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని అధికారులు హెచ్చరించారు. ఘర్షణల సమయంలో పోలీసులపై కొందరు ఆందోళనకారులు రాళ్లు, ఇనుప రాడ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారని, ఈ దాడిలో పులివెందుల సీఐ, తొండూరు ఎస్ఐ తీవ్రంగా గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. దాడిలో గాయపడినతరువాయి 2 వ పేజీలో...



ఎయిర్‌టెల్‌లో 'వాయిస్ కాల్స్' ప్లాన్లు అందుబాటులోకి

న్యూఢిల్లీ: టెలికం రంగంలో వినియోగదారులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న మొబైల్ డేటాతో అవసరం లేని, కేవలం వాయిస్ కాలింగ్, ఎస్సెమ్మెస్ సేవలను ప్రైవేట్ దిగ్గజం ఎయిర్‌టెల్ ప్రారంభించింది. సబ్‌స్క్రైబర్ల కోసం రూ. 185, రూ. 203, రూ. 206 ధరలతో మూడు ప్రత్యేక ప్రీపెయిడ్ ప్లాన్‌లను మార్కెట్లోకి తీసుకువచ్చింది. టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) విధించిన అక్టోబర్ 21 డెడ్‌లైన్‌కు కొద్ది రోజుల ముందే ఈ ప్లాన్‌లను అందుబాటులోకి తెచ్చిన తొలి టెలికం ఆపరేటర్‌గా ఎయిర్‌టెల్ నిలిచింది. కంపెనీ వెబ్‌సైట్, థర్డ్-పార్టీ రీఛార్జ్ యాప్‌లలో ఇవి ఇప్పటికే అందుబాటులోకి

రాశి ఫలాలు

19.10.2026

మేషం: వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగమున అధికారుల ఆగ్రహానికి గురి అవుతారు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. చేపట్టిన పనులు కష్టసాధ్యంతో పూర్తవుతాయి. స్థిరాస్తి వ్యవహారాలలో పెద్దలతో మాటపట్టింపులు తప్పవు. సంతాన విద్యా విషయాలు నిరుత్సాహపరుస్తాయి.

వృషభం: సోదరులతో మనస్పర్ధలు తొలగుతాయి. గృహ వాతావరణం సంతోషకరంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుని లాభాలు అందుకుంటారు. ముఖ్యమైన వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసివస్తాయి. అవసరానికి ఇతరుల నుండి ధన సహాయం అందుతుంది. నూతన ఉద్యోగ అవకాశాలు అందుతాయి.

మిథునం: నూతన వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగులకు అధికారుల నుండి ఒత్తిడి తప్పదు. నేత్ర సంభందిత అనారోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి గంధరగోళంగా ఉంటుంది. దైవ చింతన పెరుగుతుంది.

కర్కాటకం: సంతాన విద్యా ఉద్యోగ విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. వ్యాపారాలలో ఆశించిన విధంగా రాణిస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. దూరపు బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది.

సింహం: ఆదాయనికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఋణదాతల ఒత్తిడి పెరుగుతుంది. ఉదర సంబంధ అనారోగ్య సమస్యలు భాదిస్తాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. వ్యాపారాలలో ఊహించని సమస్యలు ఎదురవుతాయి. వృత్తి ఉద్యోగాలలో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

కన్య: సంఘంలో ప్రముఖుల నుండి విశేషమైన ఆదరణ లభిస్తుంది. సంతాన ఉద్యోగ వివాహ ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తాయి. ధన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. గృహమున సంతాన శుభకార్య విషయమై ప్రస్తావన వస్తుంది. ముఖ్యమైన పనులు బంధుమిత్రుల సహాయ సహకారాలతో పూర్తి చేస్తారు.

తుల: ఉద్యోగమున చాలాకాలంగా వేదిస్తున్న సమస్యలు పరిష్కరించుకుంటారు. వ్యాపార వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. ఇంటాబయటా అనుకూల వాతావరణం ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో స్వంత ఆలోచనలతో ముందుకు సాగడం మంచిది. బంధువులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

వృశ్చికం: ఒక వ్యవహారంలో ఇతరుల ప్రవర్తన వలన మానసిక అశాంతి కలుగుతుంది. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు విఫలమౌతాయి. కుటుంబ సభ్యులతో చిన్నపాటి మాటపట్టింపులుంటాయి. చేపట్టిన పనులు మధ్యలో నిలిచిపోతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

ధనస్సు: వృత్తి వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. నిరుద్యోగులకు అతి కష్టం మీద అల్ప ఫలితం పొందుతారు. ఉద్యోగాలలో బాధ్యతలు మరింత అధికమౌతాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. కొన్ని వ్యవహారాలు సమస్యాత్మకంగా సాగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి.

మకరం: ఉద్యోగమున అధికారుల ఆదరణ పెరుగుతుంది. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో జీవిత భాగస్వామి సలహాలు కలసివస్తాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

కుంభం: బంధు మిత్రులతో సఖ్యత పెరుగుతుంది. వ్యాపారాలలో శత్రు సమస్యలు నుండి తెలివిగా బయటపడతారు. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. ఆర్థిక ఆలోచనలు అనుకూలంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. సన్నిహితులతో గృహమున ఆనందంగా గడుపుతారు.

మీనం: నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. దూరప్రాంత బందు మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. ఉద్యోగమున మంచి పనితీరుతో అధికారుల నుండి ప్రశంసలు పొందుతారు. కీలక సమయంలో మంచి ఆలోచనా జ్ఞానంతో ముందుకు సాగుతారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

డొక్కు బస్సులు



మొదటి పేజీ తరువాయి

మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పండగ వేళ ప్రయాణికుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అదనపు భారం మోపుతున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

టికెట్ ధరల్లో భారీ వ్యత్యాసం

పండగ ప్రత్యేక బస్సుల్లో 50 శాతం సర్‌చార్జి వసూలు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) వర్గాలు చెబుతున్నాయి. సాధారణ సర్వీసుల్లో చార్జీలు యథాతథంగా ఉన్నాయని స్పష్టం చేస్తున్నాయి. అయితే, ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించాల్సి వచ్చినప్పుడు ప్రయాణికులపై పడుతున్న అదనపు భారం చర్చనీయాంశంగా మారింది. జూబ్లీ బస్‌స్టేషన్ (జేబీఎస్) నుంచి కరీంనగర్‌కు సాధారణ టికెట్ ధర రూ.230 ఉండగా, ప్రత్యేక బస్సులో రూ.400 వసూలు చేస్తున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. అలాగే మహబూబ్‌నగర్ నుంచి మహాత్మా గాంధీ బస్‌స్టేషన్ (ఎంజీబీఎస్)కు సాధారణంగా రూ.220గా ఉన్న టికెట్ ధర రూ.290కు పైగా పెరిగిందని తెలిపారు. అయితే, ఈ ధరల వ్యత్యాసం ఆయా సర్వీసుల వర్గీకరణ, వర్తించే చార్జీల ఆధారంగా ఉందో లేదో అధికారికంగా పరిశీలించాల్సి ఉంది. ప్రయాణికులకు చార్జీల వివరాలను స్పష్టంగా తెలియజేయడంతోపాటు, ప్రత్యేక బస్సులుగా నడిపే సర్వీసుల విషయంలో పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉంది.

ఖాళీగా తిరిగొచ్చే బస్సుల ఖర్చుల కోసమేనా?

పండగ ప్రత్యేక బస్సులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిన తర్వాత తిరుగు ప్రయాణంలో ఖాళీగా రావాల్సి వస్తుందని, అలా ఏర్పడే నిర్వహణ ఖర్చులను భర్తీ చేసేందుకే 50 శాతం సర్‌చార్జి వసూలు చేస్తున్నామని ఆర్టీసీ అధికారులు వివరిస్తున్నారు. 2003లో జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 16 ప్రకారమే ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని, ఇది కొత్తగా ప్రవేశపెట్టిన పద్ధతి కాదని చెబుతున్నారు. అయితే, నిబంధనల ప్రకారం అదనపు చార్జీలు వసూలు చేస్తున్నప్పటికీ, పండగ వేళ ప్రజలపై పడే భారాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయాలు పరిశీలించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. ప్రయాణికులకు సరిపడా బస్సులు అందుబాటులో ఉంచడం, సాధారణ సర్వీసులను తగ్గించకుండా చూడడం, ప్రత్యేక బస్సుల చార్జీలను ముందుగానే ప్రకటించడం వంటి చర్యలు అవసరమని ప్రజలు కోరుతున్నారు. పండగలంటే కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపే సమయం. ప్రయాణ ఖర్చులే భారంగా మారితే సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడి పెరుగుతుంది. పాత బస్సులనే ప్రత్యేక సర్వీసులుగా నడుపుతున్నారన్న ఆరోపణలకు స్పష్టత ఇవ్వడంతోపాటు, మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్న డిమాండ్ బలపడుతోంది.

చార్జీలను ఉపసంహరించుకోవాలి: హరీశ్ రావు

బతుకమ్మ, దసరా పండగల వేళ తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ చార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. పండగకు సొంతూళ్లకు వెళ్లాలనే ప్రజల ఉత్సాహాన్ని చార్జీల పెంపు దెబ్బతీసిందని ఆరోపించారు. పెంచిన చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సాధారణ సర్వీసులను తగ్గించి, వాటినే పండగ ప్రత్యేక బస్సులుగా చూపిస్తూ అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి కరీంనగర్‌కు సాధారణ టికెట్ ధర రూ.230 ఉండగా, ఇప్పుడు రూ.400 వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు రూ.220గా ఉన్న టికెట్ ధరను రూ.290కు పైగా పెంచారని తెలిపారు. “ఇదేనా మీ ప్రజా పాలన?” అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పండగ సమయంలో ప్రజలకు ఉపశమనం కల్పించాల్సింది పోయి, అదనపు చార్జీలతో ఇబ్బందులకు గురిచేయడం ఏమిటని నిలదీశారు. మరోవైపు, పండగ రద్దీని దృష్టిలో ఉంచుకుని నడుపుతున్న 7,000 ప్రత్యేక బస్సులకు మాత్రమే అదనపు చార్జీలు వర్తిస్తాయని టీజీఎస్ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. సాధారణ సర్వీసుల్లో చార్జీలు యథాతథంగా ఉన్నాయని స్పష్టం చేస్తున్నాయి. ప్రత్యేక బస్సులు గమ్యస్థానాలకు చేరిన తర్వాత ఖాళీగా తిరిగి రావడం వల్ల ఏర్పడే నిర్వహణ వ్యయాన్ని భర్తీ చేసేందుకు 50 శాతం సర్‌చార్జి వసూలు చేస్తున్నట్లు అధికారులు వివరిస్తున్నారు.



..పోయిరావమ్మ బతుకమ్మా..!

మొదటి పేజీ తరువాయి

బతుకమ్మ శుభాకాంక్షలు చెప్పాడు. బతుకమ్మను చూస్తే చాలా ముద్దుగా అనిపిస్తుందని, ఇంట్లో వాళ్లు బతుకమ్మను చేస్తుంటారని విజయ్ గుర్తుచేసుకున్నాడు. మన పండుగలు ఇంత జోరుగా జరిపిస్తుంటే సంతోషంగా అనిపిస్తుందని విజయ్ హర్షం వ్యక్తం చేశాడు. పెళ్లి తర్వాత రష్మికతో కలిసి తెలంగాణలో జరిగే అతిపెద్ద బతుకమ్మ వేడుకల్లో పాల్గొనాలని ముందే అనుకున్నానని, అనుకున్నట్టు గానే తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని విజయ్ సంతోషం వ్యక్తం చేశాడు. అందరూ బాగుండాలని, అందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటూ దసరా, సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు చెప్పాడు.



ఫ్రాన్స్ ఆగమాగం

మొదటి పేజీ తరువాయి

మార్సెల్, లియోన్, లిల్లే వంటి నగరాల్లోనూ ఈ నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులు లూటీలకు, దహనకాండలకు పాల్పడ్డారు. ఈ ఘటనల్లో దేశవ్యాప్తంగా సుమారు 1200 మందిని అదుపులోకి తీసుకున్నామని, 150 మందికి పైగా పోలీసులు గాయపడ్డారని ఫ్రెంచ్ అధికారులు తెలిపారు. ఈ హింసను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తీవ్రంగా ఖండించారు. “మన గణతంత్రంలో హింసకు తావులేదు” అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘటనపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫ్రాన్స్‌లో నెలకొన్న అశాంతికి వలస విధానాలే కారణమని ఆయన ఆరోపించారు. “వైవిధ్యం, కరుణ పేరుతో పాశ్చాత్య ఉదారవాదులు మూడో ప్రపంచ దేశాలను ఫ్రాన్స్ వంటి దేశాల్లోకి దిగుమతి చేసుకున్నారు. కానీ, వారిని కలుపుకుపోవడం వంటి ప్రాథమిక ప్రశ్నలను విస్మరించారు” అని వ్యాఖ్యానించారు. మరిన్ని చారిత్రక కట్టడాలు కాలిపోకముందే ఫ్రాన్స్ ఈ ఆందోళనలను ఆపాలని, అమెరికాలో కాంగ్రెస్ డెమోక్రాట్లు కోరుకుంటున్న భవిష్యత్తు ఇదేనని ఆయన హెచ్చరించారు.



మృత్యు ట్రక్కు

మొదటి పేజీ తరువాయి

ప్రహరీ గోడను, ప్రధాన గేటును బలంగా ఢీకొట్టింది. దీంతో గోడ కూలి కొందరు శిథిలాల కింద చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బానిసలు అనడం నా తప్పే


మొదటి పేజీ తరువాయి

వారు ఫిర్యాదు చేయడానికి కూడా సాహసించడం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ బలహీనతను కంపెనీలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయని వాన్స్ ఆరోపించారు. ఈ నెల ప్రారంభంలో వాన్స్ చేసిన వ్యాఖ్యలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ‘ఇండెంచర్డ్ సర్వెంట్స్’ అనే పదం అత్యంత అవమానకరమని, దీని వెనుక బాధాకరమైన చారిత్రక, వలసవాద నేపథ్యం ఉందని భారత్ స్పష్టం చేసింది. భారతీయ నిపుణులు అత్యంత విద్యావంతులని, నైపుణ్యం కలవారని, వారు అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ఆవిష్కరణలకు ఎనలేని సేవలందిస్తున్నారని విదేశాంగ శాఖ గుర్తుచేసింది. తరతరాలుగా వలస వచ్చిన వారి వల్లే అమెరికా చరిత్ర రూపుదిద్దుకుందన్న విషయాన్ని కూడా నొక్కి చెప్పింది. కొన్ని ఐటీ సంస్థలను గ్రీన్ కార్డ్ కార్యక్రమం నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన సందర్భంగా జేడీ వాన్స్ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అమెరికన్ ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో తక్కువ జీతాలకు పనిచేసే విదేశీ నిపుణులను కంపెనీలు నియమించుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారత నిపుణుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించాయి. తాజాగా వాన్స్ వివరణతో ఈ వివాదం కొంత సద్దుమణిగినట్లు కనిపిస్తోంది.

‘వాయిస్ కాల్స్’ ప్లాన్లు అందుబాటులోకి

మొదటి పేజీ తరువాయి

వచ్చాయి. ఎయిర్‌టెల్ ప్రవేశపెట్టిన ఈ మూడు ప్లాన్‌లలోనూ బేసిక్ కాలింగ్ ప్రయోజనాలు ఒకేలా ఉంటాయి. ప్రతి ప్లాన్‌లోనూ దేశవ్యాప్తంగా అపరిమిత లోకల్, ఎస్‌టీడీ, రోమింగ్ కాల్స్‌తో పాటు మొత్తం 300 ఎస్సెమ్మెస్‌లు, ఉచిత హలోట్యూన్స్ లభిస్తాయి. ఇందులో రూ. 185 ప్లాన్ 28 రోజుల వ్యాలిడిటీని అందించే అత్యంత చౌకైన ఆఫ్షన్ కాగా, రూ. 203 రీఛార్జ్ సరిగ్గా 30 రోజుల వ్యాలిడిటీని ఇస్తుంది. ఇక రూ. 206 ప్లాన్ రోజులతో సంబంధం లేకుండా పూర్తి ఒక ‘క్యాలెండర్ నెల’ వ్యాలిడిటీతో రావడం విశేషం. ఈ ప్లాన్‌లు ప్రధానంగా ఫీచర్ ఫోన్లు ఉపయోగించే సాధారణ పౌరులకు, ఇళ్లలో నిరంతరం వై-ఫై నెట్‌వర్క్‌పై ఆధారపడే వారికి, కేవలం ఇన్‌కమింగ్/కాలింగ్ కోసం మాత్రమే సెకండరీ సిమ్ కార్డ్‌ను నిర్వహించే వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఇప్పటివరకు డేటా వాడని వినియోగదారులు కూడా బండిల్డ్ రీఛార్జ్ ప్యాక్‌లలో అనవసరంగా మొబైల్ డేటా కోసం అదనపు డబ్బులు చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు అన్-బండిల్డ్ ప్లాన్లు అందుబాటులోకి రావడంతో, కస్టమర్లు తమ వాడకానికి తగిన రీఛార్జ్‌ను మాత్రమే ఎంచుకుని నెలవారీ ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చు.



562 మందిపై హత్యాయత్నం కేసులు..?

మొదటి పేజీ తరువాయి

పోలీసులకు సంబంధించిన వివరాలతో పాటు ఘటనలో పాల్గొన్న వ్యక్తుల గుర్తింపు, వారి పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఘటన సమయంలో పరిస్థితులు అదుపుతప్పే స్థాయికి చేరుకోవడంతో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు గాలిలోకి కాల్పులు జరపాల్సి వచ్చిందని అధికారులు స్పష్టం చేశారు. ఈ చర్యతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించినట్లు తెలిపారు. ఘర్షణలకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించడం, నిందితుల పాత్రను నిర్ధారించడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు.

ఒక్క ఉద్యోగం లేదు.. రూ.కోట్లలో వసూళ్లు

జర్మనీ ఉద్యోగాల పేరిట టాంకామ్ భారీ మోసం.. 70 మంది యువకుల నుంచి ఒక్కొక్కరి దగ్గర రూ.4.5 లక్షల వరకు వసూలు

టాంకామ్‌పై మాజీమంత్రి హరీశ్ రావు ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 18 (ఈవార్తలు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రభుత్వ ఆధ్వర్యంలోని టాంకామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) నిరుద్యోగ యువతను దోచుకునే ఓ పెద్ద రాకెట్‌గా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. జర్మనీలో ఉద్యోగాల పేరు చెప్పి 70 మందికి పైగా యువకుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి, వారిని నట్టేట ముంచారని సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హరీశ్ రావు ఆరోపణల ప్రకారం, సుమారు 15 జిల్లాల నుంచి 70–75 మంది నిరుద్యోగ యువకుల నుంచి టాంకామ్ ఒక్కొక్కరి దగ్గర రూ.4.10 లక్షల చొప్పున వసూలు చేసింది. పరీక్షలు, ఇన్సూరెన్స్, వీసా ఖర్చులతో కలిపి ఇది ఒక్కో అభ్యర్థికి దాదాపు రూ.4.5 లక్షలకు చేరిందని ఆయన వివరించారు. పేద రైతు కుటుంబాలకు చెందిన వారు తమ ఇంట్లోని మహిళల బంగారాన్ని తాకట్టు పెట్టి, అప్పులు చేసి ఈ డబ్బు కట్టారని, రెండేళ్లు గడిచినా ఉద్యోగాలు రాకపోవడంతో ఇంకా వడ్డీలు చెల్లిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లు దాటినా, బాధితుల్లో ఒక్కరిని కూడా ఒక్క జర్మన్ కంపెనీ కూడా ఇంటర్వ్యూ చేయలేదని హరీశ్ రావు తెలిపారు. జర్మన్ భాషలో బీ1 పరీక్ష పాసైన వారిని, ఇప్పుడు బీ2 పాస్ కావాలని చెప్పి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వీరిలో తొమ్మిది మంది జర్మనీకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారంటూ టాంకామ్ ప్రచారం చేసుకున్నా, ఒక్కరు కూడా వెళ్లలేదని స్పష్టం చేశారు. ఈ అభ్యర్థులతో కుదుర్చుకున్న ఒప్పందంలో ఏదైనా వివాదం తలెత్తితే 1,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నో కోర్టులో తేల్చుకోవాలని నిబంధన పెట్టడం దారుణమని అన్నారు. టాంకామ్ ద్వారా ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో చెప్పాలని ఆర్టీఐ ద్వారా అడిగినా,



గడువు ముగిసినా సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు. బాధితులు రెండేళ్లుగా ఎదురుచూస్తుంటే, ఈ ఏడాది జూన్‌లో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్త టాంకామ్ బ్యాచ్‌ను ప్రారంభించి ఉద్యోగ హామీలు ఇవ్వడం బాధితులను అవమానించడమేనని హరీశ్ రావు దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఈ మోసానికి పాల్పడిన టాంకామ్, ఫెయిర్‌స్ట్రీట్ ఇండియా సంస్థల నుంచి వసూలు చేసిన ప్రతి రూపాయిని బాధితులకు తిరిగి చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. వారు కోల్పోయిన రెండేళ్ల కాలానికి, వడ్డీ భారం, మానసిక వేదనకు నష్టపరిహారం అందించాలన్నారు. బాధితులందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, ఈ వ్యవహారంపై తక్షణమే సీఐడీ లేదా జ్యుడీషియల్ విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఫీజుల వసూళ్లు, కల్పించిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హరీశ్ రావు తన పోస్టులో స్పష్టం చేశారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

ఏపీలో మున్సిపల్.. నామినేషన్ల గడువు క్లోజ్

చివరి రోజు భారీగా తరలివచ్చిన అభ్యర్థులు

విజయవాడ, అక్టోబర్ 18 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ ముగిసింది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు విధించిన గడువు ఆదివారం (అక్టోబర్ 18) మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. చివరి రోజు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు అభ్యర్థులు, వారి మద్దతుదారులతో కిటకిటలాడాయి. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి కార్యాలయ ప్రాంగణాల్లో ఉన్న వారందరికీ అధికారులు టోకెన్లు జారీ చేసి, వారి నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో పురపోరు రసవత్తరంగా మారనుంది.

దర్శిలో వైసీపీకి ఎదురుదెబ్బ

ప్రకాశం జిల్లా దర్శిలో వైసీపీకి ఊహించని పరిణామం ఎదురైంది. గడువు ముగియడంతో దాదాపు 25 మంది వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారు. సమయానికి కార్యాలయానికి చేరుకోలేకపోవడంతో వారు నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశమైంది.

తదుపరి షెడ్యూల్ ఇదే

నామినేషన్ల పర్వం ముగియడంతో ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియపై దృష్టి సారించింది. షెడ్యూల్ ప్రకారం, రేపు (అక్టోబర్ 19) నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 21 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత బరిలో నిలిచే తుది అభ్యర్థులపై స్పష్టత రానుంది. అక్టోబర్ 28న పోలింగ్ జరగనుండగా, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు.

పొల్ట్రీ రైతులను ఆదుకోవాలి

సీఎం రేవంత్‌కు బండ్ల గణేశ్ విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబర్ 18 (ఈవార్తలు): పౌల్ట్రీ పరిశ్రమ ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై తక్షణమే స్పందించి, రైతులను ఆదుకోవాలని ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఈరోజు ఆయన ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఒక ప్రకటన చేశారు. పౌల్ట్రీ పరిశ్రమకు కీలకమైన మొక్కజొన్న, సోయాబీన్, డీఓసీ వంటి ముడిసరుకులను కొందరు స్టాకిస్టులు అక్రమంగా గోదాముల్లో నిల్వ చేస్తున్నారని బండ్ల గణేశ్ ఆరోపించారు. దీనివల్ల మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి, ధరలను అమాంతం పెంచుతున్నారని ఆయన పేర్కొన్నారు.

విశాఖ డేటా సెంటర్లకు ప్రత్యేక టెక్నాలజీ!

నీటి వినియోగంపై అదానీ–గూగుల్ కీలక నిర్ణయం

వైజాగ్, అక్టోబర్ 18 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌ను కీలక డేటా హబ్‌గా మార్చే దిశగా చేపట్టిన ప్రాజెక్టులలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నారు. విశాఖపట్నంలో అదానీ కనెక్స్, గూగుల్ సంయుక్తంగా నిర్మిస్తున్న భారీ డేటా సెంటర్లలో నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించేందుకు అత్యాధునిక ఎయిర్–కూల్డ్ టెక్నాలజీని ఉపయోగించనున్నట్లు సంస్థ ప్రకటించింది. ముదసర్లోవ, తర్లువాడ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న ఈ క్యాంపస్‌లలో ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. సాధారణంగా డేటా సెంటర్ల నిర్వహణకు, కూలింగ్ వ్యవస్థలకు భారీ పరిమాణంలో మంచినీరు అవసరమవుతుంది. అయితే, దీనికి భిన్నంగా ఎయిర్–కూలింగ్ టెక్నాలజీని వాడటం ద్వారా నీటి అవసరాన్ని దాదాపుగా తొలగించనున్నారు. ఈ ప్రాజెక్టులన్నింటిలో కలిపి మొత్తం మంచినీటి వినియోగం ఒక ఒలింపిక్ స్విమ్మింగ్ పూల్ పరిమాణం కంటే తక్కువగానే ఉంటుందని అంచనా. ఇందులో కూడా 80 శాతం నీటిని కేవలం ఉద్యోగుల సౌకర్యాలు, వంటగదులు, పచ్చదనం పెంపకం వంటి అవసరాలకే కేటాయించనున్నారు. ఈ ప్రాజెక్టులు ముదసర్లోవ రిజర్వాయర్,



కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యం సమీపంలో ఉండటంతో నీటి వనరులపై ప్రభావం చూపుతాయనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో, గృహ అవసరాలకు వినియోగించే నీటి వనరులపై ఆధారపడకుండా, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ వాటర్ కనెక్షన్ల ద్వారానే నీటిని సేకరించనున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. అంతేకాకుండా, 'జీరో–డిశ్చార్జ్' విధానాన్ని పాటిస్తూ, ప్రాజెక్టులో వెలువడే మురుగునీటిని ఆన్‌సైట్ ప్లాంట్‌లో శుద్ధి చేసి, ఇరిగేషన్, ఫ్లషింగ్ వంటి అవసరాలకు తిరిగి వినియోగిస్తారు. శుద్ధి చేసిన నీటిని కూడా ముదసర్లోవ రిజర్వాయర్‌లోకి వదిలే ప్రసక్తే లేదని హామీ ఇచ్చారు. అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎడ్జ్‌కనెక్స్ సంస్థల జాయింట్ వెంచరే ఈ అదానీ కనెక్స్. గూగుల్‌తో కలిసి దాదాపు 1 గిగావాట్ సామర్థ్యంతో హైపర్‌స్కేల్ డేటా సెంటర్లను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ సంస్థ పనిచేస్తోంది. ఈ ప్రాజెక్టులతో పాటు రిలయన్స్, ఎయిర్‌టెల్ వంటి సంస్థల కార్యకలాపాలతో విశాఖపట్నం త్వరలో దేశంలోనే ఒక ముఖ్యమైన డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌గా మారనుంది.

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

ఏపీ గవర్నర్‌కు జగన్ వినతి

అమరావతి, అక్టోబర్ 18 (ఈవార్తలు): ఏపీలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కోరారు. ఆదివారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార కూటమి అప్రజాస్వామిక పద్ధతులకు పాల్పడుతోందని, ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. సమావేశం అనంతరం జగన్ మీడియాలో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంతటి అప్రజాస్వామిక వాతావరణాన్ని తానెప్పుడూ చూడలేదని అన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం కేంద్ర బలగాల పర్యవేక్షణలో, సీసీటీవీ కెమెరాల నిఘాలో జరిపేలా చూడాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. వైసీపీ అభ్యర్థులను నామినేషన్ కేంద్రాల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, అదే సమయంలో టీడీపీ మద్దతుదారులను లోపలికి అనుమతించి దాడులు చేయిస్తున్నారని గవర్నర్‌కు వివరించినట్లు చెప్పారు. ఈ అరాచకాలకు పోలీసులు కూడా అధికారపక్షానికే మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని 8 ప్రాంతాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని, మరో 19 చోట్ల కేవలం 36 శాతం నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకో 8 ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేశారని తెలిపారు. పులివెందులలో 36 వార్డులకు గాను కేవలం 19 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ ఎంపీలు అవినాశ్ రెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి వట్ల వ్యవహరించిన తీరు, అభ్యర్థులపై పోలీసుల కాల్పులు, తప్పుడు కేసులు బనాయించడం వంటి అంశాలను కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. క్రియాశీలకంగా ఉన్న వైసీపీ కార్యకర్తలను భయపెట్టేందుకు బైండోవర్ కేసుల కుట్ర జరుగుతోందని జగన్ ఆరోపించారు.

ఆర్టీసీలో గెలిచినా దక్కని గుర్తింపు!

హైదరాబాద్, అక్టోబర్ 18 (ఈవార్తలు): టీజీఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన తమకు ధ్రువీకరణ పత్రం (విక్టరీ సర్టిఫికెట్) అందజేయడంలో కార్మిక శాఖ జాప్యం చేస్తోందని టీజీఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆరోపించింది. ఎన్నికల్లో గెలుపొందిన తమకు వెంటనే సర్టిఫికెట్ జారీ చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ నేతలు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ), తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ)లతో కూడిన జేఏసీ కూటమి ఘన విజయం సాధించింది. అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడి అనేక రోజులు గడుస్తున్నా కార్మిక శాఖ అధికారులు ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా అనవసరంగా ఆలస్యం చేస్తున్నారని జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే కార్మిక శాఖ అధికారులు తమకు అడ్డంకులు సృష్టిస్తున్నారని జేఏసీ నేతలు తమ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంలో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి వెంటనే జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని జేఏసీ విజ్ఞప్తి చేసింది.



VANGS GLOBAL TECHNOLOGIES LLP

ePaper Pro
దసరా శుభాకాంక్షలు

DASARA SPECIAL OFFER

Launch Your Cloud-Hosted ePaper Today

Powering modern newsrooms with AI-powered image extraction & multi-language support

20% OFF ON EVERY PLAN

NEWS ONLY website · web stories · breaking news

Standard 5 GB · 5 users
SAVE 20%
- ✓ Automatic PDF extraction
- ✓ Custom domain & push alerts
- ✓ Web stories, gallery, headlines
- ✓ Country & device-wise views

~~₹8,124~~ **₹6,499**
20% OFF · SAVE ₹1,625 / YEAR

Expanded 10 GB · 10 users
SAVE 20%
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

~~₹12,499~~ **₹9,999**
20% OFF · SAVE ₹2,500 / YEAR

Full Press 15 GB · 30 users
SAVE 20%
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

~~₹16,249~~ **₹12,999**
20% OFF · SAVE ₹3,250 / YEAR

ePAPER ONLY PDF to interactive ePaper

Standard 5 GB · 5 users
SAVE 20%
- ✓ Automatic PDF extraction
- ✓ Custom domain & push alerts
- ✓ Unlimited pageviews & SEO
- ✓ Country & device-wise views

~~₹9,999~~ **₹7,999**
20% OFF · SAVE ₹2,000 / YEAR

Expanded 10 GB · 10 users
SAVE 20%
- ✓ WhatsApp & email support
- ✓ Drag & drop theme builder
- ✓ Employee ID card design
- ✓ Custom domain & push alerts

~~₹14,999~~ **₹11,999**
20% OFF · SAVE ₹3,000 / YEAR

Full Press 15 GB · 30 users
SAVE 20%
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Custom domain & push alerts

~~₹19,999~~ **₹15,999**
20% OFF · SAVE ₹4,000 / YEAR

NEWS + ePAPER the complete digital newspaper

Standard 5 GB · 5 users
SAVE 20%
- ✓ Automatic PDF extraction
- ✓ Custom domain & push alerts
- ✓ Web stories, gallery, headlines
- ✓ Country & device-wise views

~~₹17,499~~ **₹13,999**
20% OFF · SAVE ₹3,500 / YEAR

Expanded 10 GB · 10 users
SAVE 20%
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

~~₹22,499~~ **₹17,999**
20% OFF · SAVE ₹4,500 / YEAR

Full Press 15 GB · 30 users
BEST VALUE
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

~~₹32,499~~ **₹25,999**
20% OFF · SAVE ₹6,500 / YEAR

PLATFORM HIGHLIGHTS

- ◆ Smart AI image extraction
- ◆ AdSense & sponsor ad slots
- ◆ Custom domain + auto SSL
- ◆ One-click publishing
- ◆ WhatsApp sharing
- ◆ AI tagging & SEO tags
- ◆ Real-time analytics
- ◆ AWS cloud · daily backups
- ◆ YouTube video embedding

Try free for 12 days

No credit card required · Turn your print edition into a digital publication


CALL / WHATSAPP
+91 7675087378

EMAIL
hr@vangstechnologies.com

WEBSITE
www.vangstechnologies.com

SCAN TO VISIT OUR WEBSITE

SCAN TO CALL +91 7675087378




మహాగౌరి అలంకారంలో రాజరాజేశ్వరి అమ్మవారు

వేములవాడ, అక్టోబర్ 18 (ఈవార్తలు): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన ఆదివారం శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు మహాగౌరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన ఆలయంలో శ్రీ రాజరాజేశ్వరస్వామివారి పూజా కార్యక్రమాలను అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని మండపంలో అమ్మవారి ప్రత్యేక దర్శనాలు, పూజలకు ఏర్పాట్లు చేశారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



దుర్గామాత చిత్రాన్ని గీసిన చిన్నారికి సన్మానం



జగిత్యాల, అక్టోబర్ 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని కనకదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దశమ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భోనాల పండుగ సందర్భంగా దుర్గామాత చిత్రపటాన్ని అద్భుతంగా చిత్రించింది చిన్నారి కాత్యాయని. ఆ చిత్రంలో అమ్మవారి రూపం మహిమాన్వితంగా, శోభాయమానంగా కనువిందు చేసింది. ఈ సందర్భంగా సమితి సభ్యులు ఆ చిన్నారిని సత్కరించారు.

పూడూరు రామాలయం సమీపంలో రోడ్డు ప్రమాదం

మల్యాల: జగిత్యాల జిల్లా మల్యాల మండలం పూడూరు రామాలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై కరీంనగర్‌కు తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతులు రాజస్థాన్‌కు చెందినవారిగా గుర్తించినట్లు సమాచారం. స్థానికుల సహాయంతో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనం వివరాలు, ఘటనకు సంబంధించిన ఇతర అంశాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో స్థానికంగా విషాదం నెలకొంది.



నూకలమర్రిలో బతుకమ్మ సంబరాలు

వేములవాడ రూరల్, అక్టోబర్ 18 (ఈవార్తలు): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను వేములవాడ రూరల్ మండలం నూకలమర్రిలో మహిళలు ఘనంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, బతుకమ్మల చుట్టూ ఆడిపాడుతూ పండుగ సందడిని చాటుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో పండుగ శోభ నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయత, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

సింగపూర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



సింగపూర్, అక్టోబర్ 18 (ఈవార్తలు): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటుతూ సింగపూర్‌లో తెలంగాణ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు, ఆటపాటలతో వేడుకలు ఉత్సాహంగా సాగాయి. సింగపూర్‌లో నివసిస్తున్న తెలుగువారితోపాటు స్థానికులు, అతిథులు, ప్రవాస భారతీయులు కలిపి సుమారు 3 వేల మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. భారత్ నుంచి వచ్చిన కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, బంధువులు కూడా వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని సొసైటీ ప్రతినిధులు పేర్కొన్నారు. దశాబ్దానికి పైగా సింగపూర్‌లో బతుకమ్మ పండుగకు విశేష ఆదరణ కల్పిస్తూ తెలంగాణ సంస్కృతిని పరిచయం చేస్తున్నామని తెలిపారు. ఇతర సంస్థలు కూడా బతుకమ్మ వేడుకలు నిర్వహించడం సంతోషకరమన్నారు. మహిళలు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి తీసుకొచ్చారు. బతుకమ్మలను తీసుకొచ్చిన ప్రతి మహిళకు ఎర్ర తివాచీపై స్వాగతం పలికి తనిష్క్ జ్యువెలర్స్ తరఫున బహుమతి సమాహారాన్ని అందజేశారు. ప్రత్యేకంగా అలంకరించిన బతుకమ్మలకు, సంప్రదాయ వస్త్రధారణలో వచ్చిన ముగ్గురు మహిళలకు సౌజన్య డెకార్స్, బీఎస్‌కే కలెక్షన్స్, కేఎస్ పట్టు ఫ్యాషన్స్, వియోమి ఫ్యాషన్స్ సంస్థలు ప్రత్యేక బహుమతులు అందించాయి. వేడుకలకు సహకరించిన దాతలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్లాటినం, గోల్డ్, సిల్వర్ విభాగాల్లో సహకరించిన సంస్థలు, వ్యక్తిగత దాతలను శాలువాలతో సత్కరించారు.



బల్వంతాపూర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ

మల్యాల, అక్టోబర్ 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం బల్వంతాపూర్ గ్రామంలోని 'ఈవార్తలు' దినపత్రిక ప్రధాన కార్యాలయం ఆవరణలో సద్దుల బతుకమ్మ సంబురాలు అట్టహాసంగా జరిగాయి. చిన్నారులు, పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మకు నీరాజనం పలికారు. తెలుగుదనం ఉట్టిపడే చీరల్లో మెరిసిపోయిన ఆడబిడ్డలు.. చప్పట్లు, కాళ్ల సవ్వళ్లతో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



పూల బతుకమ్మతో పులకించిన మల్యాల మండలం

మల్యాల: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో ఘనంగా జరిగాయి. మల్యాలతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూల పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. గునుగు, తంగేడు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ సందడి చేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ కలిసిమెలిసి వేడుకల్లో పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరుల వద్ద నిమజ్జనం చేశారు. మహిళల ఆటపాటలతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది. ప్రకృతితో మమేకమై, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేసే బతుకమ్మ పండుగ మల్యాలలో తెలంగాణ పల్లె సంస్కృతిని చాటిచెప్పింది.

జర్నలిస్టుల హక్కుల పోరాటంలో వెనకడుగు వేయం

మూడోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన అబ్దుల్ రహమాన్‌కు ఘన సన్మానం



ఆసిఫాబాద్, అక్టోబర్ 18 (ఈవార్తలు): జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతామని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ స్పష్టం చేశారు. జిల్లా మూడో మహాసభలో మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనకు ఆదివారం జిల్లా కేంద్రంలోని టీయూడబ్ల్యూజే కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య (టీయూడబ్ల్యూజేఎఫ్) ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. పూలమాలలు వేసి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సమాఖ్య ప్రతినిధులు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం అబ్దుల్ రహమాన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆయన గతంలో అందించిన సేవలను గుర్తించి మూడోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకోవడం జర్నలిస్టులందరికీ గర్వకారణమని కొనియాడారు. అనంతరం టీయూడబ్ల్యూజేఎఫ్ నూతన అధ్యక్షుడు మాజీద్ ఇక్బాల్, కార్యదర్శి నసిర్ ఖాన్‌లను అబ్దుల్ రహమాన్ శాలువాలు కప్పి సన్మానించారు. తనపై నమ్మకంతో మూడోసారి బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పోరాటంలో వెనకడుగు వేయకుండా, వారి సమస్యల పరిష్కారం కోసం అందరినీ కలుపుకొని మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు ముఫ్ఖం అహ్మద్, వసీ ఖాన్, అజర్ తదితరులు పాల్గొన్నారు.



అమెరికాలోనూ తెలంగాణ బతుకమ్మ వైభవం

ఆస్టిన్‌లో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో వేడుకలు

ఆస్టిన్, అక్టోబర్ 18 (ఈవార్తలు): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ అమెరికాలోని ఆస్టిన్ నగరంలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కమ్యూనిటీ పార్కులో జరిగిన ఈ సంబరాల్లో మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు, ఆటపాటలతోపాటు సంగీత కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పుల సందడి, నృత్యాలతో ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది. భారత్ నుంచి వచ్చిన కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, బంధువులు కూడా పాల్గొనడంతో ఆనందం రెట్టింపైందని నిర్వాహకులు తెలిపారు. ఆస్టిన్‌లో నివసిస్తున్న తెలుగువారితోపాటు స్థానికులకు బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను పరిచయం చేస్తూ తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పడం ఆనందంగా ఉందని ఫోరం ప్రతినిధులు పేర్కొన్నారు. ఇతర సంస్థలు కూడా బతుకమ్మ వేడుకలు నిర్వహించడం సంతోషకరమన్నారు.

2,018 రోజులుగా అన్నదాన సేవలు



వేములవాడ, అక్టోబర్ 18 (ఈవార్తలు): ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం గొప్ప సేవగా భావిస్తూ మై వేములవాడ అన్నదాన సేవా ట్రస్టు దాతల సహకారంతో నిరంతర అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఆదివారం స్థానిక టీటీడీ ధర్మశాల సమీపంలోని రాజన్న భీమన్న ఆలయం వద్ద పేదలు, అన్నార్తులకు భోజనం అందించారు. ఈ సేవలు 2,018 రోజులుగా కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఇట్టేడు జగదీశ్వరయ్య-శారదాబాయి దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, హైదరాబాద్‌కు చెందిన డా. విష్ణువర్ధన్, డా. రామకృష్ణ దంపతులు అన్నదానానికి సహకరించారు. నేరెళ్ల సంతోష్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వామన్, నేరెళ్ల సందీప్-ప్రసన్న దంపతులు కూడా సేవలో భాగస్వాములయ్యారు. అన్నదాన శాశ్వత సభ్యులుగా డా. జువ్వాడి వెంకటేశ్వరరావు, స్నేహలత, ప్రతాప, స్వప్న, సంపత్, నగుబోతు రవీందర్, జ్యోతి, గణాచారి మఠం శైలజ, సాంబశివు, దేవరాజు, ఉమ, బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత కుటుంబ సభ్యులు, హైదరాబాద్‌కు చెందిన చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ తదితరులు సహకరిస్తున్నారని ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. పుట్టినరోజులు, పెళ్లిరోజులు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో వేములవాడ ఆలయ పరిసరాల్లో అన్నదానం చేయాలనుకునే దాతలు ట్రస్టు సభ్యులను లేదా 9246939388 నంబరును సంప్రదించాలని నిర్వాహకులు మధు మహేష్ కోరారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, ప్రతాప, నటరాజు, నక్క వేణు, గొండ ప్రసాద్, ద్వారక శేఖర్, నామాల లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేటలో ఘనంగా సద్దుల బతుకమ్మ

వేడుకల్లో పాల్గొన్న పీసీసీ ఉపాధ్యక్షురాలు డా. కోట నీలిమ



హైదరాబాద్, అక్టోబర్ 18 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని బన్సీలాల్‌పేటలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. పీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా. కోట నీలిమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బన్సీలాల్‌పేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనసూయ, విజయ్‌కుమార్, పాండు గౌడ్, నారాయణ ఆహ్వానం మేరకు ఆమె తొలుత దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కోట నీలిమ వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు.



కయ్యారి చిత్రం



బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు

డ్రైవర్ పరిస్థితి విషమం

బాఘీ, బాఘీ 2, వార్ సినిమాల ఫేమ్ బాలీవుడ్ స్టార్ హీరో టైగర్ ష్రాఫ్‌పై ముగ్గురు దుండగులు కాల్పులు జరిపారు. ముంబైలోని ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన కలకలం రేపింది. ఈ దాడిలో టైగర్ ష్రాఫ్ కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడగా పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటనలోనే మరో వ్యక్తి గాయపడ్డాడు. ఇప్పుడీ విషయం బాలీవుడ్‌లో షాకింగ్‌గా మారింది. ఈ దాడి చేసింది తామేనని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించుకున్నట్లు వార్తలొస్తున్నాయి. గతంలో వీళ్లు సల్మాన్ ఖాన్‌పై కూడా కాల్పులు జరిపారు. మరోవైపు జుహు పరిధిలో జరిగిన ఈ కాల్పుల ఘటనలో టైగర్ ష్రాఫ్ క్షేమంగా ఉన్నారని డీసీపీ మోహిత్ గార్గ్ స్పష్టం చేశారు. ఈ దాడికి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బాధ్యత వహించినట్లు లేదా వారి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు ఇప్పటివరకు అధికారికంగా ఎక్కడా ధ్రువీకరించలేదు. బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని దుండగులని గుర్తించేందుకు, దాడి వెనుక ఉన్న అసలు కారణాలను తేల్చేందుకు ప్రత్యేక బృందాలు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా విచారణను కొనసాగిస్తున్నాయి. ఈ ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి ఫడ్నవీస్.. విచారణకు ఆదేశించారు.



వారణాసి వాయిదా?

టాలీవుడ్‌లో వరుసగా సినిమాల విడుదల తేదీల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా ప్రభాస్ నటిస్తున్న 'స్పిరిట్' చిత్రాన్ని వచ్చే ఏడాది దీపావళికి విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. మరోవైపు త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న 'అదర్శ కుటుంబం' అదిగో ఇదిగో అన్నారే తప్పా.. రిలీజ్ డేట్ ఊసే లేదు. అంటే విడుదల తేదీపై ఇంకా స్పష్టత రాలేదనే తెలుస్తోంది. ఇలా పలు సినిమాల విడుదల తేదీలు మారుతుండటంతో ఇప్పుడు అందరి దృష్టి దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి'పై పడింది. గతంలో 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' చిత్రాల విడుదల తేదీల్లోనూ మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో.. ఇప్పుడు మహేశ్‌బాబు సినిమా విషయంలోనూ అలాంటిదే జరుగుతుందా? అనే చర్చ మొదలైంది. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి విజువల్ ఎఫెక్ట్స్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కీలకం కానున్నాయి. ఇలాంటి సినిమాలకు నిర్మాణానంతర పనులు పూర్తిచేయడానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంటుంది. మరోవైపు ఇతర భారీ చిత్రాల విడుదల తేదీల్లోనూ మార్పులు చోటుచేసుకుంటుండటంతో 'వారణాసి' విడుదలపై అభిమానుల్లో చర్చ నడుస్తోంది. అయితే, ఈ సినిమా విడుదల తేదీ మారబోతోందంటూ జరుగుతున్న ప్రచారానికి ఇప్పటివరకు అధికారికంగా స్పష్టత లేదు. చిత్రబృందం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే సినిమా విడుదలవుతుందా? లేక ఏదైనా మార్పు ఉంటుందా? అనేది తెలియాల్సి ఉంది.

కావాలనే ప్యారడైజ్‌పై నెగెటివ్ ప్రచారం

నాని హీరోగా వచ్చిన లేటెస్ట్ మూవీ ది ప్యారడైజ్. శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద అంతగా మెప్పించలేకపోయింది. ఓ జాతి మనుగడ కోసం చేసే పోరాటం ఆధారంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నప్పటికీ అనుకున్న స్థాయిలో కలెక్షన్స్ రాబట్టలేకపోయింది. దీంతో బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ఈ నేపథ్యంలో ఈ మూవీ ఫలితం గురించి ప్రముఖ టాలీవుడ్ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడారు. ది ప్యారడైజ్ మూవీపై నెగెటివ్ ప్రచారం చేయడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. సినిమా రిలీజైన మొదటి రోజు నుంచే ది ప్యారడైజ్‌పై నెగెటివ్ ప్రచారం చేశారని విమర్శించారు. ఈ మూవీ గురించి నెగెటివ్ రాయొద్దని చెప్పినవాళ్లే.. ఆ పని చేశారని తమ్మారెడ్డి ఆరోపించారు. తాజా ఇంటర్వ్యూలో ఆయన ఈ విధంగా స్పందించారు.

రాఖీ సావంత్‌పై నాన్-బెయిలబుల్ వారెంట్



ప్రముఖ బాలీవుడ్ నటి రాఖీ సావంత్‌కు ఊహించిన షాక్ తగిలింది. 2010లో చోటుచేసుకున్న లక్ష్మణ్ అహిర్వార్ ఆత్మహత్య కేసులో ఆమెకు వ్యతిరేకంగా ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ ఫాస్ట్ ట్రాక్ కోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి కోర్టులో జరుగుతున్న విచారణకు రాఖీ సావంత్ చాలాకాలం నుంచి నోటీసులు తీసుకుంటూ హాజరుకాకపోవడంతో, అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఈ కఠినమైన ఉత్తర్వులను జారీ చేసినట్లుగా డిస్ట్రిక్ట్ గవర్నమెంట్ కౌన్సెల్ మృదుల్ కాంత్ శ్రీవాత్సవ మీడియాకు వెల్లడించారు. కాగా, ఝాన్సీలోని హన్సారీ ప్రేమ్‌నగర్ ప్రాంతానికి చెందిన లక్ష్మణ్ అహిర్వార్, తన భార్య అనితతో ఏర్పడిన దాంపత్య విభేదాల పరిష్కారం కోసం 2010 అక్టోబర్‌లో ప్రసారమైన రాఖీ కా ఇన్సాఫ్ అనే రియాలిటీ షోలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా రాఖీ సావంత్ తనపై తీవ్ర స్థాయిలో అభ్యంతరకర, అవమానకర వ్యాఖ్యలు చేశారని, ఆ అవమానాన్ని తట్టుకోలేక లక్ష్మణ్ అహిర్వార్ 2010 నవంబర్ 10న ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపణలు ఉన్నాయి. మృతుడు లక్ష్మణ్ ఆత్మహత్య అనంతరం ఆయన తల్లి సావిత్రి స్థానిక ప్రేమ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 'రాఖీ కా ఇన్సాఫ్' షోలో రాఖీ సావంత్ వాడిన భాష, చేసిన అవమానకర వ్యాఖ్యలే తన కొడుకు మరణానికి కారణమని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాజాగా జారీ అయిన నాన్-బెయిలబుల్ వారెంట్ నేపథ్యంలో, ఈ కేసు తదుపరి విచారణను ఫాస్ట్ ట్రాక్ కోర్టు డిసెంబర్ 1కి వాయిదా వేసింది.

విశ్వక్ సేన్ 'కల్ట్' ట్రైలర్ రిలీజ్

ఈ నగరానికి ఏమైంది?, ఫలక్‌నుమా దాస్, హిట్ సినిమాలతో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న విశ్వక్ సేన్.. తర్వాతి కాలంలో రొటీన్ రొట్టకొట్టుడు సినిమాలతో వరస ఫ్లాప్స్, డిజాస్టర్స్ చూశాడు. దీంతో చాలా గ్యాప్ తీసుకున్నాడు. ఈ టైంలో తానే దర్శకుడిగా మారి అందులో నటించి ఓ మూవీ తీశాడు. అదే 'కల్ట్'. ఈ నెల 30న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ వదిలారు. 'కల్ట్' ట్రైలర్ బట్టి చూస్తే.. గోవాలో కల్ట్ అనే పబ్‌లో ఓ రోజు రాత్రి 300 మందికి పైగా పార్టీ చేసుకుంటూ ఉంటారు. అయితే కొందరు వ్యక్తులు వీళ్లని లోపలే లాక్ చేసి ఓ గేమ్ పెడతారు. ఓడిపోతే చంపేస్తారు. అయితే ఈ పబ్‌లోనే ఇన్‌స్పెక్టర్ సంకల్ప్ నాయక్ కూడా ఉంటాడు. మరి లోపలున్న వీళ్లంతా బయటకెలా వచ్చారు. అసలు ఈ సెటప్ అంతా ఏంటి? అనేది మూవీ చూసి తెలుసుకోవాలి. ఈ సినిమాలో కీలక పాత్ర చేసిన విశ్వక్ సేన్.. దర్శకత్వం వహించాడు. ఇందులో గాయత్రి భరద్వాజ్ హీరోయిన్ కాగా రవి బస్రూర్ సంగీతమందించాడు. ట్రైలర్‌లో చాలా సీన్స్ వయలెంట్‌గా ఉన్నాయి. యువత మాత్రమే చూసే ఈ చిత్రం ఎలాంటి ఫలితం అందుకుంటుందనేది చూడాలి?




నా ముఖం వాచిపోయిందని.. : నివేదా థామస్

సినిమా తారలు సైతం తమ రూపం(బాడీ) గురించి ఇతరులు ఏమనుకుంటారోనని భయపడుతుంటారు. తాజాగా హీరోయిన్ నివేదా థామస్ చేసిన ఓ పోస్ట్‌లో ఇదే విషయాన్ని వెల్లడించింది. ఈ ఏడాది మొదట్లోనే దిగిన కొన్ని ఫొటోలను ఇప్పటివరకు సోషల్ మీడియాలో పంచుకోలేకపోయానని ఆమె తెలిపింది. తన ముఖం ఉబ్బినట్లు కనిపిస్తుందేమో.. ఇతరులు ఏమనుకుంటారోననే ఆలోచనలతో వాటిని తన గ్యాలరీలోనే ఉంచేసినట్లు తెలిపింది. 'ఆ రోజు తాను ఎంతో అందంగా కనిపించాను.. ఆ ఫొటోలను చూసిన ప్రతిసారీ అప్పటి జ్ఞాపకాలు, నవ్వులు, ఉదయాన్నే నిద్రలేవడం, కాఫీ కౌంటర్ దగ్గరకు వెళ్లడం, సంతోషనంగా గడిపిన క్షణాలు గుర్తుకొచ్చేవి. అయినప్పటికీ నన్ను చూసిన ఇతరులు ఏమంటారో అనే ఆలోచన అప్పటి ఫొటోలను పోస్ట్ చేయకుండా అడ్డుకున్నాయి. ఇన్ని నెలలపాటు వాటిని దాచిపెట్టడం బాధగా ఉంది' అని పేర్కొంది. '[ప్రస్తుతం ప్రతిదీ కృత్రిమంగానే మారుతోంది. నిజమైన మనిషిలా మన భావోద్వేగాలతో సహా సహజంగా ఉండటమే అందమైన విషయం. మనలో కలిగే ఆలోచనలను పట్టించుకోకుండా ఉండడం కాదని.. వాటి అంగికరిస్తూనే జీవితాన్ని ఆస్వాదించాలి' అని చెప్పింది.



రణబాలి.. తగ్గేదేలే..!



విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా నటించిన లేటెస్ట్ మూవీ రణబాలి. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తొలి రోజు ఈ మూవీకి మిక్స్‌డ్ టాక్ వచ్చింది. విజయ్, రష్మిక యాక్టింగ్, స్టోరీ బాగున్నప్పటికీ.. నిడివి, స్లోనెరేషన్ కొంత ఇబ్బందికరంగా మారాయని పలు వెబ్‌సైట్లు తమ రివ్యూల్లో పేర్కొన్నాయి. ఫలితంగా తొలి రోజు ఈ చిత్రం రూ. 16.15 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. అయితే టాక్ ఎలా ఉన్నప్పటికీ రణబాలికి ఆదరణ కనిపిస్తోంది. ఈ సినిమా టికెట్స్ హాట్ కేకుల్లా బుకింగ్స్ అవుతున్నాయి. ఇదంతా చూస్తుంటే రణబాలి నెమ్మదిగా పుంజుకుంటున్నట్లు అర్థమవుతోంది. ఈ సినిమాకు బుక్‌మైషోలోనే మొత్తం 750కె టికెట్స్ సేల్ అయ్యాయి. దీంతో మొదటి వారంలోనే ఈ సంఖ్య 1 మిలియన్ దాటుతుందని నిర్మాతలు భావిస్తున్నారు. కాగా.. ఈ చిత్రంలో ది మమ్మీ ఫేమ్ ఆర్నాల్డ్ వోస్లూ విలన్ రోల్ పోషించారు. ఈ చిత్రంలో ఈశ్వరీ రావు, లాల్, వినోద్ సాగర్, మధు నందన్, కిషోర్ కుమార్ కీలక పాత్రల్లో కనిపించారు. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో నిర్మించారు.



బాలీవుడ్ బోల్డ్ బ్యూటీ సన్నీలియోన్ వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. విభిన్నమైన పాత్రలు చేస్తూ దూసుకెళ్తున్న ఈ భామ.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఎమోషనల్ కామెంట్స్ చేశారు. తన కెరీర్ తొలినాళ్ల కష్టాలు, చిన్ననాటి ఆర్థిక సమస్యల గురించి మాట్లాడుతూ.. జీవితంలో సక్సెస్ సాధించడానికి ఎలాంటి షార్ట్‌కట్‌లు ఉండవని, కేవలం కష్టపడటం వల్ల మాత్రమే అనుకున్నది సాధించగలమని ఆమె స్పష్టం చేశారు. చిన్న వయసులోనే తాను ఎదుర్కొన్న అనుభవాలే తనకు ఈ వాస్తవాన్ని నేర్పించాయని తెలిపారు. చిన్నతనంలో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నానని, సమాజంలో రకరకాల విమర్శలను భరించానని సన్నీలియోన్ గుర్తుచేసుకున్నారు. కేవలం 7, 8 ఏళ్ల వయసులోనే తాను డబ్బు సంపాదించడం కోసం చిన్నచిన్న పనులు చేయడం మొదలుపెట్టినట్లు చెప్పారు. ఇంటింటికీ వెళ్లి వస్తువులు అమ్మడం, మంచును శుభ్రం చేయడం, పలు స్టాళ్లు పెట్టడం లాంటి ఎన్నో పనులు చేశానని తెలిపారు.



ప్రియాంశ్ ఆర్య డబుల్ సెంచరీ మిస్

రంజీ ట్రోఫీలో ఢిల్లీ ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ విధ్వంసకర బ్యాటర్)కు గుండెకోత మిగిలింది. గుజరాత్‌తో ఇవాళ ప్రారంభమైన మ్యాచ్‌లో అతడు ఒక్క పరుగు తేడాతో డబుల్ సెంచరీ మిస్ అయ్యాడు. ఈ విషయం అతడితో పాటు అతడి అభిమానులకు తీవ్ర నిరాశ కలిగించింది. సోషల్‌మీడియాలో ప్రియాంశ్‌పై సానుభూతి పెల్లుబుకుతోంది. అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు.. డబుల్ సెంచరీకి అర్హుడంటూ కామెంట్ల వర్షం కురుస్తోంది. గత ఐపీఎల్ సీజన్‌లోనూ ప్రియాంశ్ ఓ మ్యాచ్‌లో అర్హమైన సెంచరీని చేజార్చుకున్నాడు. న్యూ ఛండీఘడ్‌తో లక్నోతో జరిగిన మ్యాచ్‌లో అతడు 37 బంతుల్లో 93 పరుగుల వద్ద ఔటయ్యాడు. మొత్తంగా రంజీ ట్రోఫీ 2026-27 రెండో రౌండ్ మ్యాచ్‌ల తొలి రోజు ప్రియాంశ్ డబుల్ సెంచరీ మిస్ అంశం హైలైట్ అయ్యింది. మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ భారీ స్కోర్ దిశగా సాగుతోంది. ప్రియాంశ్ తృటిలో డబుల్ సెంచరీ మిస్ (220 బంతుల్లో 199; 24 ఫోర్లు, 6 సిక్సర్లు) చేసుకోగా.. కెప్టెన్ ఆయుశ్ బదోని (115) అజేయ శతకంతో క్రీజ్‌లో ఉన్నాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఢిల్లీ స్కోర్ 381-4గా ఉంది. బదోనికి జతగా సుమిత్ మాథుర్ (0) క్రీజ్‌లో ఉన్నాడు. గుజరాత్ బౌలర్లలో హర్షల్ పటేల్ 2, మనన్ హింగ్రాజియా ఓ వికెట్ పడగొట్టగా.. ఆయుశ్ దోసేజా (29) రనౌటయ్యాడు.



వైభవ్ విషయంలో గంభీర్ తప్పుచేశాడు!

టీమిండియా యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి నిరీక్షణ తప్పడం లేదు. వెస్టిండీస్‌తో ఇటీవల ముగిసిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో జట్టుకు ఎంపికైనప్పటికీ, అతనికి ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడే అవకాశం రాలేదు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. వైభవ్ మరికొంత కాలం వేచి చూడాల్సిందేనని పరోక్షంగా సంకేతాలిచ్చారు. ఈ నిర్ణయం ఇప్పుడు భారత క్రికెట్ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ప్రస్తుతం జట్టులో స్థిరపడిన ఓపెనింగ్ జోడీ అభిషేక్ శర్మ, సంజూ శాంసన్‌లకే యాజమాన్యం ప్రాధాన్యత ఇచ్చింది. ఫామ్‌లో ఉన్నంత మాత్రాన తుది జట్టులో చోటు దక్కుతుందని భావించకూడదని, సీనియర్ ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం, భద్రతాభావం కల్పించడం ముఖ్యమని కోచ్ గంభీర్ గతంలోనే వైభవ్‌కు వివరించినట్లు తెలుస్తోంది. నిలకడగా రాణిస్తున్న ఆటగాళ్లకే తమ మొదటి ప్రాధాన్యత అని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ పరిణామం మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ నాయకత్వ శైలిని గుర్తుకు తెస్తోంది. ముఖ్యంగా ఎంఎస్ ధోనీ విషయంలో గంగూలీ అనుసరించిన వైఖరికి, గంభీర్ వ్యూహానికి మధ్య ఉన్న తేడాపై విశ్లేషణలు మొదలయ్యాయి. ధోనీ తన అంతర్జాతీయ కెరీర్ ఆరంభంలో తొలి నాలుగు ఇన్నింగ్స్‌లలో విఫలమైనప్పటికీ, గంగూలీ అతనిపై నమ్మకం ఉంచి వరుస అవకాశాలు కల్పించాడు. ఆ నమ్మకాన్ని నిలబెడుతూ ధోనీ పాకిస్థాన్‌పై 148 పరుగుల కీలక ఇన్నింగ్స్‌తో చెలరేగి తన కెరీర్‌ను గొప్పగా మలుచుకున్నాడు. ఒక ఆటగాడిని ఎంపిక చేశాక, వారిపై ఒత్తిడి తగ్గించి సహజంగా రాణించేందుకు కనీసం పది మ్యాచ్‌లైనా అవకాశాలు ఇవ్వాలన్నది గంగూలీ సిద్ధాంతం. ప్రతిభావంతులైన యువకులకు అండగా నిలబడితేనే వారు భవిష్యత్ స్టార్లుగా ఎదుగుతారని దాదా బలంగా నమ్మేవాడు. ఇప్పుడు టీమిండియా తదుపరి న్యూజిలాండ్‌లో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌లోనైనా వైభవ్ సూర్యవంశీకి యాజమాన్యం అవకాశం ఇస్తుందా? లేక గంభీర్ తన వ్యూహానికే కట్టుబడి ఉంటాడా? అనేది ఆసక్తికరంగా మారింది.





షఫాలీ సునామీ

స్మృతి మంధాన మెరుపు ఫినిషింగ్.. 8.5 ఓవర్లలోనే జింబాబ్వేపై టీమిండియా విన్

జింబాబ్వేతో రెండో టీ20లో భారత మహిళల జట్టు అదరగొట్టింది. తొలుత బౌలింగ్‌లో ప్రత్యర్థిని కట్టడి చేసిన టీమిండియా.. ఆ తర్వాత బ్యాటింగ్‌లో విధ్వంసం సృష్టించింది. ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన ఆకాశమే హద్దుగా చెలరేగడంతో స్వల్ప లక్ష్యాన్ని భారత్ కేవలం 8.5 ఓవర్లలోనే ఛేదించింది.

షఫాలీ వర్మ 25 బంతుల్లో 55 పరుగులతో విరుచుకుపడగా.. కెప్టెన్ స్మృతి మంధాన 23 బంతుల్లో 40 పరుగులతో మెరిపించింది. మొదట బ్యాటింగ్ చేసిన జింబాబ్వే మహిళల జట్టు భారత బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో సుమారు 100 పరుగులకే పరిమితమైంది.

ఆ జట్టు బ్యాటర్లలో చిపో ముగేరి-తిరిపానో 32 బంతుల్లో 34 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. జోసెఫిన్ న్మోమో 29 బంతుల్లో 24 పరుగులతో పోరాడింది. అయితే మిగతా బ్యాటర్లు భారీ స్కోరు చేయడంలో విఫలమయ్యారు. భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ జింబాబ్వేను ఒత్తిడిలోకి నెట్టారు. దీప్తి శర్మ బెలవ్డ్ బిజాను ఔట్ చేయగా.. నందిని శర్మ కూడా వికెట్ సాధించింది. యువ క్రికెటర్ నికి ప్రసాద్ తన అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి బంతికే వికెట్ తీసి ఆకట్టుకుంది. చిపో ముగేరి-తిరిపానోను రిచా ఘోష్ క్యాచ్ పట్టడంతో నికి ప్రసాద్‌కు తొలి వికెట్ దక్కింది. అనంతరం నికి ప్రసాద్ మరో వికెట్ సాధించడంతో జింబాబ్వే ఇన్నింగ్స్ మరింత ఒత్తిడిలో పడింది. భారత ఫీల్డర్లు కూడా కీలక పాత్ర పోషించారు. రనౌట్‌తో పాటు క్యాచ్‌ల ద్వారా జింబాబ్వే బ్యాటర్లను పెవిలియన్‌కు పంపారు. దీంతో జింబాబ్వే భారత్ ముందు కేవలం 103 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని మాత్రమే ఉంచగలిగింది. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు షఫాలీ వర్మ, స్మృతి మంధాన అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. తొలి ఓవర్ నుంచే షఫాలీ బౌండరీలతో విరుచుకుపడింది. ఆరంభంలోనే ఫోర్, సిక్స్‌తో జింబాబ్వే బౌలర్లపై ఒత్తిడి పెంచింది. మరోవైపు మంధాన అచితూచి ఆడుతూ వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదింది. రెండో ఓవర్‌లో మంధాన వరుసగా రెండు ఫోర్లు కొట్టగా.. ఆ తర్వాత షఫాలీ కూడా తనదైన శైలిలో దూకుడు కొనసాగించింది. మూడో ఓవర్‌లో సిక్స్ బాదిన షఫాలీ.. నాలుగో ఓవర్‌లోనూ బౌండరీతో సత్తా చాటింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య భాగస్వామ్యం వేగంగా పెరిగింది. నాలుగో ఓవర్‌లో మంధాన వరుసగా నాలుగు ఫోర్లు బాదడంతో భారత స్కోరు ఒక్కసారిగా ఊపందుకుంది. ఐదో ఓవర్‌లో షఫాలీ వర్మ వరుస బౌండరీలతో విరుచుకుపడింది. ఆ ఓవర్‌లో నాలుగు ఫోర్లు సహా 21 పరుగులు రావడంతో జింబాబ్వే బౌలర్లు ఒత్తిడికి గురయ్యారు. పవర్‌ప్లే ముగిసే సమయానికి భారత్ వికెట్ నష్టపోకుండా 76 పరుగులు చేసింది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి ఆరు ఓవర్లలో భారత్ సాధించిన అత్యధిక స్కోర్లలో ఈ ప్రదర్శన కూడా చోటు దక్కించుకుంది. జింబాబ్వే బౌలర్లకు ఎక్కడా అవకాశం ఇవ్వకుండా షఫాలీ, మంధాన పరుగుల వరద పారించారు. షఫాలీ వర్మ తన విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రేక్షకులను అలరించింది. బౌలర్ ఎవరన్నది పట్టించుకోకుండా బంతిని బౌండరీ దాటించడమే లక్ష్యంగా ఆడింది. ఏడో ఓవర్‌లో సిక్స్ బాది కేవలం 24 బంతుల్లోనే అర్ధశతకాన్ని పూర్తి చేసింది. ఆ వెంటనే మరో సిక్స్ కొట్టి జట్టును విజయానికి మరింత చేరువ చేసింది. చివరకు 25 బంతుల్లో 55 పరుగులు చేసిన షఫాలీ.. ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో ఆకట్టుకుంది. బెలవ్డ్ బిజా బౌలింగ్‌లో లాంగ్‌ఆన్‌లో క్యాచ్ ఇవ్వడంతో ఆమె ఇన్నింగ్స్ ముగిసింది. అప్పటికే భారత్ విజయం దాదాపు ఖాయమైంది. షఫాలీ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన అనుష్క శర్మతో కలిసి మంధాన లక్ష్యాన్ని పూర్తి చేసింది. మంధాన తన దూకుడును కొనసాగిస్తూ 23 బంతుల్లో 40 పరుగులు సాధించింది. ఆమె ఇన్నింగ్స్‌లో ఫోర్లు, సిక్సర్లతో పాటు చక్కటి టైమింగ్ కనిపించింది. చివరికి ఒలిండర్ చారే బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాది మంధాన మ్యాచ్‌ను ముగించింది.

పవర్‌లిఫ్టింగ్‌లో ఐఆర్ఎస్ అధికారినికి 3 స్వర్ణాలు

ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) అధికారిణి ఏక్తా బిష్ణోయ్ క్రీడా ప్రపంచంలో చరిత్ర సృష్టించారు. అమెరికాలో జరిగిన వరల్డ్ మాస్టర్స్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఏకంగా మూడు స్వర్ణ పతకాలను కైవసం చేసుకుని దేశం గర్వపడేలా చేశారు. ఈ విజయంతో, మాస్టర్స్-2 విభాగంలో స్వర్ణం గెలిచిన తొలి భారత మహిళా పవర్‌లిఫ్టర్‌గా ఆమె రికార్డులకెక్కారు. ఈ పోటీల్లో ఏక్తా బిష్ణోయ్ మొత్తం 362.5 కిలోల బరువును ఎత్తి, జపాన్, కెనడాకు చెందిన బలమైన ప్రత్యర్థులను అధిగమించారు. ఒకవైపు ఉన్నత ప్రభుత్వ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, కఠినమైన పవర్‌లిఫ్టింగ్ శిక్షణను కొనసాగించడం ఆమె అంకితభావానికి నిదర్శనం. అయితే, ఈ విజయం అంత సులువుగా దక్కలేదు. టోర్నమెంట్‌కు ముందు భారత జట్టు కోచ్ సునీల్ కుమార్ యూఎస్ వీసా తిరస్కరణకు గురైంది. అయినా ఏమాత్రం వెనకడుగు వేయని ఏక్తా, వీడియో కాల్స్ ద్వారా కోచ్ సునీల్ నుంచి సూచనలు తీసుకున్నారు. టీమ్ అధికారి ఇబ్రహీం సహకారంతో వ్యూహాత్మకంగా ఆడి చారిత్రక విజయాన్ని అందుకున్నారు. గెలుపు వ్యూహంపై కోచ్ సునీల్ కుమార్ మాట్లాడుతూ, "మా వ్యూహం చాలా స్పష్టంగా ఉంది. స్క్వాట్ ఈవెంట్ ముగిసేసరికే సమీప ప్రత్యర్థిపై 20 కిలోల ఆధిక్యాన్ని సాధించాం. బెంచ్ ప్రెస్‌లో ఆ ఆధిక్యాన్ని నిలబెట్టుకుని, చివరగా 150 కిలోల డెడ్‌లిఫ్ట్‌తో భారత్‌కు స్వర్ణ పతకాన్ని ఖాయం చేశాం" అని వివరించారు. ఏక్తా ఢిల్లీలోని నేతాజీ జిమ్‌లో కోచ్ సునీల్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నారు.



శ్రేయస్ అయ్యర్‌కు స్పెషల్ అవార్డు

వెస్టిండీస్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో అద్భుతంగా రాణించిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు ప్రత్యేక అవార్డు లభించింది. ఈ సిరీస్‌లో బ్యాటింగ్‌తో పాటు నాయకత్వంలోనూ ఆకట్టుకున్న అతడికి టీమిండియా మేనేజ్‌మెంట్ 'ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును అందించింది. సిరీస్ ముగిసిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్రేయస్‌కు ఈ అవార్డును అందించారు. భారత జట్టు ట్రైనింగ్ అసిస్టెంట్ నువాన్ సేనవిరత్నే శ్రేయస్ ప్రదర్శనను ప్రశంసిస్తూ ఈ అవార్డును అందజేశాడు. సిరీస్‌లో శ్రేయస్ అయ్యర్ ఐదు ఇన్నింగ్స్‌ల్లో మొత్తం 181 పరుగులు చేశాడు. లక్నోలో జరిగిన తొలి టీ20లో కేవలం 43 బంతుల్లోనే అజేయమైన 102 పరుగులు చేసి జట్టు విజయంలో ప్రధానపాత్ర పోషించాడు.

షాయ్ హోప్ కోసం ఐపీఎల్ ఫ్రాంచైజీల పోటీ

వెస్టిండీస్ టీ20 కెప్టెన్ షాయ్ హోప్ తన అద్భుతమైన ఫామ్‌తో ఐపీఎల్ ఫ్రాంచైజీల దృష్టిని బలంగా ఆకర్షిస్తున్నాడు. ఇటీవలే భారత పర్యటనలో సెంచరీల మోత మోగించి, పరుగుల వరద పారించిన హోప్, రాబోయే ఐపీఎల్ 2027 వేలంలో కీలక ఆటగాడిగా మారడం ఖాయంగా కనిపిస్తోంది. అతని ప్రస్తుత ఫామ్, బహుముఖ నైపుణ్యాల దృష్ట్యా పలు జట్లు అతడిని దక్కించుకోవడానికి పోటీ పడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారత్‌తో జరిగిన నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో షాయ్ హోప్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. రెండు సెంచరీలు, ఒక అర్ధ సెంచరీతో సిరీస్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. సిరీస్‌ను 2-2తో సమం చేయడంలో విండీస్ తరఫున కీలక పాత్ర పోషించాడు. వన్డేల్లోనూ స్థిరమైన ప్రదర్శన కనబరిచాడు. అంతేకాకుండా, ఈ పర్యటనలో ఒక ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఫుల్ మెంబర్ ప్లేయర్‌గానూ రికార్డు సృష్టించాడు. ఈ అద్భుత ప్రదర్శనతో, డిసెంబర్‌లో జరగనున్న ఐపీఎల్ వేలంలో అతనికి భారీ డిమాండ్ ఏర్పడే అవకాశాలున్నాయి. గతంలో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడిన హోప్‌ను తిరిగి దక్కించుకోవడానికి కొన్ని జట్లు ఆసక్తి చూపుతున్నాయి.



ఈనాటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

ఓటు కోసం రక్తపాతమెందుకు?

ఎన్నికలంటే ప్రజాస్వామ్యానికి పండుగ. ప్రజలు తమకు నచ్చిన నాయకులను ఎన్నుకునే స్వేచ్ఛకు ప్రతీక. గ్రామాభివృద్ధికి ఎవరు అండగా నిలుస్తారు? ప్రజల సమస్యలను ఎవరు పరిష్కరిస్తారు? తమ ఆకాంక్షలను ఎవరు నెరవేరుస్తారు? అనే ప్రశ్నలకు ఓటు ద్వారా సమాధానం చెప్పే అవకాశం. కానీ ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ఎన్నికల వేళ చోటుచేసుకుంటున్న దాడులు, ఘర్షణలు ఈ ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అభిప్రాయ భేదాలు రాజకీయ కక్షలుగా మారడం, ప్రత్యర్థులను భయపెట్టేందుకు భౌతిక దాడులకు దిగడం, ఎన్నికల పోటీని వ్యక్తిగత శత్రుత్వంగా చూడటం ఆందోళన కలిగించే పరిణామాలు. ఓటు కోసం దాడులకు తెగబడటం అత్యంత హేయమైన చర్య. ప్రజాస్వామ్యంలో రాజకీయ ప్రత్యర్థి శత్రువు కాదు. భిన్నమైన అభిప్రాయం కలిగిన మరో పౌరుడు మాత్రమే. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హింస కొత్త పరిణామం కాదు. దశాబ్దాలుగా వివిధ ప్రాంతాల్లో రాజకీయ ఘర్షణలు, వర్గపోరాటాలు, ప్రత్యర్థులపై దాడులు, ఎన్నికల అనంతర కక్షసాధింపు ఆరోపణలు తెరపైకి వస్తూనే ఉన్నాయి. ప్రభుత్వాలు మారినా, అధికార పక్షాలు మారినా, రాజకీయ జెండాలు మారినా హింసాత్మక ధోరణులకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడకపోవడం విషాదకరం. అధికారంలో ఉన్నప్పుడు ప్రత్యర్థులపై ఒత్తిడి తెస్తున్నారన్న విమర్శలు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయన్న ఆరోపణలు రాజకీయ వాతావరణాన్ని మరింత ఉద్రిక్తంగా మారుస్తున్నాయి. ఒక పార్టీకి జరిగిన అన్యాయాన్ని మరో పార్టీ తనకు అనుకూలమైనప్పుడు మాత్రమే ప్రశ్నిస్తే సమస్యకు పరిష్కారం లభించదు. హింసకు గురైన వ్యక్తి ఏ పార్టీకి చెందినవారైనా, దాడికి పాల్పడినవారు ఏ రాజకీయ శిబిరానికి చెందినవారైనా చట్టం ఒకే విధంగా స్పందించాలి. స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు పట్టణ స్థానిక సంస్థలు ప్రజలకు అత్యంత చేరువగా ఉండే పాలనా వ్యవస్థలు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారులు, మురుగునీటి నిర్వహణ, స్థానిక అభివృద్ధి వంటి అంశాలపై ప్రజల జీవితాలను నేరుగా ప్రభావితం చేసే నిర్ణయాలు ఇక్కడే తీసుకుంటారు. అలాంటి పదవుల కోసం జరిగే పోటీ అభివృద్ధి ప్రణాళికల చుట్టూ సాగాలి. గ్రామానికి ఏం చేస్తారు? నిధులను ఎలా వినియోగిస్తారు? ప్రజా సమస్యలకు ఎలా పరిష్కారం చూపిస్తారు? అనే అంశాలపై అభ్యర్థులు ప్రజల ముందుకు వెళ్లాలి. కానీ ప్రచారానికి బదులుగా బెదిరింపులు, చర్చలకు బదులుగా దాడులు, విధానాల పోటీకి బదులుగా కక్షసాధింపు చోటుచేసుకుంటే స్థానిక ప్రజాస్వామ్యానికి అర్థమే ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో అత్యధికంగా నష్టపోయేది సామాన్య ప్రజలే. రాజకీయంగా బలమైన వర్గాల మధ్య ఘర్షణలు చెలరేగితే గ్రామాల్లో సాధారణ జీవనం దెబ్బతింటుంది. భయాందోళనల మధ్య ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించలేరు. ప్రత్యర్థి పార్టీకి మద్దతు ఇస్తే ఏమవుతుందోననే ఆందోళన ఓటరును వెంటాడుతుంది. స్వతంత్రంగా పోటీ చేయాలనుకునే అభ్యర్థులు వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎన్నికల్లో పాల్గొనడం తమ హక్కు అని భావించాల్సిన పౌరులు, రాజకీయ బలప్రదర్శనల మధ్య ఆ హక్కును వినియోగించుకోవడానికే భయపడితే ప్రజాస్వామ్యానికి అంతకంటే పెద్ద నష్టం మరొకటి ఉండదు.

బహుముఖ ప్రజ్ఞాశాలి గుండోజు యాదగిరి

తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పాల్గొని అప్పటి ప్రభుత్వ పాశవిక చర్యకు దాదాపు 400 మంది అమరులైనారు. అలాంటి ఉద్యమంలో ప్రముఖ సాహితీవేత్త, చిత్రకారుడు, పరిశోధకులు అభ్యుదయవాది గుండోజు యాదగిరి గారు పాల్గొన్నారు. వీరికి కాల్పుల ప్రమాదం తృటిలో తప్పిపోయింది. వీరు బాలకిష్టమ్మ లక్ష్మయ్య దంపతులకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని ఎల్లమ్మ రంగాపురంలో 21 ఆగష్టు 1945 జన్మించారు. ప్రాథమిక , ఉన్నత విద్య రంగాపురంలో పూర్తి చేశారు.



హెచ్ ఎస్ సి వరకు కల్వకుర్తిలో చదివారు. తర్వాత పాలెం ఓరియం టల్ కళాశాలలో డిప్లమా, బిఓఎల్ ఆ తర్వాత ఎంఓఎల్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. 1969లో తెలంగాణ తొలి దశ ఉద్యమం ఉవ్వెత్తున లేచి విస్తరిస్తున్న సమయంలో చైతన్యవంతులైన యాదగిరి గారు ఉద్యమంలో తల మునకలుగా పాల్గొన్నారు. అంతేకాక తెలంగాణకు అనుకూలంగా పద్యాలు పాటలు,కవితలు రాశారు. ఉద్యమంలో పాల్గొన్నవారిపై 1969 లో ప్రభుత్వం కాల్పులు జరిపింది. ఆ ప్రమాదం తృటిలో తప్పిపో యింది. నవంబర్ 1969 లో తెలుగు పండితునిగా ఉ ద్యోగంలో చేరారు. తర్వాత అర్హతలను బట్టి సీనియర్ తెలుగు పండిత్ గా, తెలుగు జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతి పొందారు. ఉత్తమమైన బోధనతో విద్యార్థుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. గుండోజు గారు ఆగస్టు 2003 లో ఉ ద్యోగ విరమణ చేశారు.

తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పాల్గొని పాలకులకు వ్యతిరేకంగా గళం విప్పారు. కలం కదిలించారు. యాదగిరి గారు రుక్నుద్దీన్ తో కలిసి విప్లవధంకా అనే పేరుతో పుస్తకాన్ని వెలువరించారు. ఇది తెలంగాణ తొలి ఉద్యమ గ్రంథంగా గుర్తింపు పొందింది. యాదగిరి ఇప్పటివరకు 13 పుస్తకాలను వెలువరించారు. ఇలా గుండోజు సృజనాత్మక, పరిశోధనాత్మక రచనలే కాక మరో నాలుగు పుస్తకాలకు సంపాదకత్వం కూడ వహించారు. ప్రాణము పోయినన్ సరియె పల్కుమురా గళమెత్తి నా తెలం/గాణము జన్మహక్కని సగర్వముగా నెద పొంగ జేసి... అంటూ పై నినాదం దేశమంతా వ్యాపించాయి. ఇక్కడ దాశరథి ప్రభావం కనిపిస్తుంది. గుండెరాయి వంటి నాయకులు కండ్లు తేలేస్తారని గట్టిగా చెప్పారు విప్లవధంకా కావ్యంలో. తెలంగాణ వైభవాన్ని రాజుల వీరత్వాన్ని తెలియజేస్తూ వాళ్ల స్ఫూర్తిని తీసుకొని తెలంగాణేతరులను పారద్రోలాలని ఉద్బోధించారు. అమరవీరుల సందేశం కవితలో " నీదు ఆత్మ శాంతి కొరకు నీ ఆశయ సిద్ధి కొరకు/ తుది రక్తపుబొట్టు వరకు దివారాత్రముల మేరకు/ పరాక్రమముతో శ్రమియిస్తాం" అని అమరవీరుల కర్తవ్యాన్ని నెరవేరుస్తామని అభయమిచ్చారు కవి.

"శిల్పి" ఖండకావ్యాన్ని యాదగిరి గారు అద్భుతమైన పద్యాలతో గంభీరమైన భావంతో సరళమైన శైలిలో రాశారు. సామాజిక చైతన్యం కలిగించే రచన. దేశంలో వేల దేవాలయాల ప్రాకారాలను, శిల్పాలను ఎంతో మనోహరంగా చెక్కాడు శిల్పి . విభిన్న కళాకృతులను జీవకళ ఉ ట్టిపడేలాగా ఎన్నో శిల్పాలను దేశమంతా చెక్కాడు. కానీ అమరశిల్పి జక్కన, రామప్ప లాంటి శిల్పుల పేర్లు మాత్రమే ప్రపంచానికి తెలిశాయి. ఎంతోమంది శిల్పుల పేర్లు లోకానికి తెలియదు. శిల్పి నిస్వార్థ జీవి అని కింది పద్యంలో తెలియజేశారు కవి.

"వసుధ నెల్ల శిల్పాలతో స్వర్గసమము
చేసితివి కాని నీ పేరు చెక్క లేదు
పేర్మి లేనట్టి రాజుల పేరె నిలిచె
శిల్పి నీవెంత నిస్వార్థ జీవివయ్య "

తాజమహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలు ఎవరు? అని ప్రశ్నించి పేదలపక్షం వహించారు శ్రీ శ్రీ. అలాగే యాదగిరి గారు విశేష నైపుణ్యం ఉండి కూడా గుర్తింపు లేని శిల్పుల వైపు నిలిచారు. తల్లి తండ్రులు తన కొడుకు కష్టపడి పని చేసినప్పుడు అతని చేతులు కాయలు కాసిన విషయాన్ని గమనించి బాధపడతారు. సపర్యలు చేస్తారు. అట్లాగే కవి కూడా శిల్పి చేతుల కష్టాన్ని తాదాత్మ్యం చెంది కరుణరసాత్మకంగా వివరించారు. "ఏవీ చేతులు చూడనిమ్ము అకటా! ఎంతెంత కాయల్గదా! భావావేశమునందు గండ శిలలన్ బాదంగనే కావెనో? ..." లలిత కళలలో ప్రావీణ్యం కలవాడని శిల్పిని ప్రశంసించారు కవి. దీనిలో ప్రశంసా పర్వం, పరామర్శపర్వం, సంసారపర్వం అనే మూడు భాగాలు ఉ న్నాయి.దీనిలోని పద్యాలను గిరిజా మనోహర్ బాబు లాంటి సాహితీవేత్తలు పలు సభల్లో గానం చేశారంటే, ఈ ఖండ కావ్య విశిష్టతను అర్థం చేసుకోవచ్చు. దీనిలో పద్యధార గంగాప్రవాహంబలా సాగుతుంది.శబ్దార్థాలంకారాలను సందర్భోచితంగా ఉపయోగించారు. అర్ధవంతమైన దీర్ఘ సమాసాలున్నాయి. భావం,భాష పాలు నీళ్లలా కలిసిపోయాయి. దీనిలో పెండ్లము, కొండ్ర, పటువ...తెలంగాణ పదాల వాసన గుబాళిస్తుంది. యాదగిరి గారు " తెలంగాణ సోయి' రాధా గీత పేరుతో తెలంగాణలో ఆయా రంగాల్లో ప్రసిద్ధులైన వారి సంక్షిప్త పరిచయం చేస్తూ, వారి ముఖ చిత్రాన్ని జీవకళ ఉట్టిపడేలా చిత్రించారు. బూర్గుల రామకృష్ణారావు మొదలుకొని పైడి జయరాజ్ వరకు 51 మంది చిత్రాలను గీసి ఒక్కొక్క పేజీలో సురవరం ప్రతాపరెడ్డి, కపిలవాయి లింగమూర్తి, యాదగిరి రావు, శ్రీకాంతాచారి, దొడ్డి కొమురయ్య, రాంకీ గోండు, అబ్దుల్ ఖాదర్, లంబాడి శివంగి హీరో మార్చాల రామాచార్యులు, కాపు రాజయ్య, బోదాసు వెంకటరమణ, భైరోజు దామోదరాచార్య, కిన్నెర మొగులయ్య మొదలైన వారు ఆయా రంగాల్లో చేసిన పరిశ్రమను పరిచయం చేశారు. "ఫేసు బుక్కుకు నేనెంతొ దాసుడైతి" అనే మకుటంతో తెలం గాణ ప్రాంతంలోని కవులు చిత్రకారులు శిల్పులు కళాకారులు రాజకీయ నాయకులు.. మొదలైన వారి గురించి ఫేస్బుక్ శతకం పేరుతో పద్యాలు రాశారు. దీనిలో ఎక్క యాదగిరిరావు, గిరిజా మనోహర్ బాబు, సంగిశెట్టి శ్రీనివాస్, కిన్నెర మెట్ల మొగుల య్య, ఎర్రోజు వెంకటేశ్వర్లు మొదలైన వారిని పద్యా ల్లో సంక్షిప్తంగా పరిచయం చేశారు. తెలుగు విశ్వ విద్యాలయం కీర్తి పురస్కారం 2015, తెలంగాణ పోరాట యోధుడు కేశవ రావు జాదవ్ పురస్కారం లాంటి ఎన్నో పురస్కారాలు పొందారు. విశ్రాంత జీవితంలోనూ అవిశ్రాంతంగా చేస్తున్న సాహిత్య, చిత్ర కళాకృషిని గుర్తించిన సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ యాదగిరి గారికి ప్రతిభా పురస్కారాన్ని ఈ మధ్యనే ప్రదానం చేసింది.

- ఎర్రోజు వేంకటేశ్వర్లు
డిగ్రీ తెలుగు ఉపన్యాసకులు,
కరీంనగర్, సెల్ 9110535342

హైదరాబాద్‌కు జల'కరువు' తప్పదా?

ఒకప్పుడు చెరువులు, కుంటలు, జలాశయాలతో కళకళలాడిన భాగ్యనగరం.. నేడు నీటి భద్రతపై ఆందోళన చెందుతోంది. ఆకాశహర్మ్యాలు పెరుగుతున్నాయి.. జనాభా విస్తరిస్తోంది.. పరిశ్రమలు, ఐటీ సంస్థలు నగరానికి కొత్త రూపునిస్తున్నాయి. కానీ అదే వేగంతో నీటి వనరులు పెరగడం లేదు. ఒకవైపు పెరుగుతున్న అవసరాలు.. మరోవైపు పడిపోతున్న భూగర్భ జలమట్టాలు.. ఇంకోవైపు వాతావరణ మార్పులు, వర్షపాతంలో అనిశ్చితి.. వెరసి హైదరాబాద్ భవిష్యత్తును జలసంక్షోభం ముప్పు వెంటాడుతోంది.

మే నెల వచ్చేవరకు వేచి చూడకుండానే నీటి ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతోందన్న సంకేతాలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. హైదరాబాద్ ఎదుర్కొంటున్నది కేవలం తాగునీటి సరఫరా సమస్య కాదు. ఇది నగర ప్రణాళిక, సహజ వనరుల పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, పాలనా దక్షతకు సంబంధించిన సమగ్ర సవాలు. ఇప్పటివరకు అవసరాలు పెరిగినప్పుడల్లా కొత్త నీటి వనరుల నుంచి సరఫరా పెంచడంపైనే దృష్టి పెట్టాం. కానీ అందుబాటులో ఉన్న నీటిని ఎంత సమర్థంగా వినియోగిస్తున్నాం? వర్షపు నీటిలో ఎంత భాగాన్ని భూమిలోకి ఇంకిస్తున్నాం? చెరువులను ఎంతవరకు కాపాడుకుంటున్నాం? శుద్ధి చేసిన మురుగునీటిని తిరిగి ఎంత వినియోగిస్తున్నాం? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకకుండా నగరానికి దీర్ఘకాలిక నీటి భద్రత సాధ్యం కాదు.

జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి ప్రాంతాలతో కూడిన కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో సుమారు 1.3 కోట్లకుపైగా జనాభా నివసిస్తున్నట్లు అందుబాటులో ఉన్న గణాంకాలు సూచిస్తున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోనూ నగరం వేగంగా విస్తరిస్తోంది. నివాస సముదాయాలు, వాణిజ్య భవనాలు, పరిశ్రమలు, ఐటీ సంస్థలు పెరుగుతున్న కొద్దీ నీటి అవసరాలు అంతకంతకూ అధికమవుతున్నాయి. జలమండలి అధికారుల ద్వారా వెల్లడైన గణాంకాల ప్రకారం, నగరానికి రోజుకు సుమారు 735 మిలియన్ గ్యాలన్ల నీరు అవసరం కాగా, సరఫరా 585 మిలియన్ గ్యాలన్ల స్థాయిలో ఉంది. అంటే రోజుకు 150 మిలియన్ గ్యాలన్ల కొరత. భారతీయ కొలమానంలో ఇది సుమారు 56.8 కోట్ల లీటర్లు. అవసరమైన నీటిలో దాదాపు ఐదో వంతు అందుబాటులో లేకపోవడం చిన్న విషయం కాదు. ఈ లోటును భూగర్భ జలాలు, ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా పూడ్చుకునే ప్రయత్నం జరుగుతోంది. అయితే ఈ ప్రత్యామ్నాయాలు కూడా నిరంతరం అందుబాటులో ఉంటాయనే హామీ లేదు. సాధారణంగా వేసవి సమీపిస్తే నీటి ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతుంది. కానీ అక్టోబరు నుంచే బుకింగ్‌లు పెరుగుతున్నాయన్న నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. నగర శివారు ప్రాంతాల్లో రోజు విడిచి రోజు నీటి సరఫరా, బోరుబావుల్లో తగ్గుతున్న నీరు, ట్యాంకర్లపై పెరుగుతున్న ఆధారపడటం.. ఇవన్నీ ముందస్తు హెచ్చరికలుగా పరిగణించాలి. నీటి కొరతను వేసవి సమస్యగా మాత్రమే చూడటం మానుకోవాలి. ఇది ఏడాది పొడవునా పరిష్కారాలు కోరుతున్న నగర సమస్య.

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, మంజీరా–సింగూరు వ్యవస్థ, కృష్ణా జలాల సరఫరా వ్యవస్థ, గోదావరి జలాల సరఫరా వ్యవస్థ హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కీలక ఆధారాలు. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, ఈ ప్రధాన జలాశయాల మొత్తం పూర్తిస్థాయి సామర్థ్యం 59.130 టీఎంసీలు కాగా, అక్టోబరు 16 నాటికి నిల్వలు 27.507 టీఎంసీలుగా నమోదయ్యాయి. అంటే పూర్తిస్థాయి సామర్థ్యంలో సగం కంటే తక్కువ నీరే నిల్వ ఉంది. అయితే ఈ నిల్వలన్నీ నగర తాగునీటి అవసరాలకు పూర్తిగా వినియోగించుకోగలమని భావించడం సరికాదు. జలాశయాల్లోని నీటిని ఇతర అవసరాలు, నీటి నాణ్యత, సరఫరా పరిమితులు, ఆవిరి నష్టం, పంపిణీ వ్యవస్థలోని లోపాలు ప్రభావితం చేస్తాయి. అందువల్ల ప్రస్తుత నిల్వలు ఎన్ని రోజులు సరిపోతాయన్న అంచనాలను మాత్రమే ఆధారంగా చేసుకుని భరోసా పొందలేం. ముఖ్యంగా తదుపరి వర్షాకాలం వరకు నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని ముందస్తు ప్రణాళికలు రూపొందించాలి. హైదరాబాద్ తాగునీటి భద్రత అంటే జలాశయాల్లో నీరు ఉండటమే కాదు. ఆ నీటిని నగరంలోని ప్రతి ప్రాంతానికి సమానంగా, సురక్షితంగా, నిరంతరాయంగా అందించగలగడం కూడా. నీటి లభ్యత తగ్గినప్పుడు ముందుగా ఇబ్బందులు ఎదుర్కొనేది సాధారణంగా శివారు ప్రాంతాలు, తక్కువ ఆదాయ వర్గాల నివాస ప్రాంతాలే. ట్యాంకర్లను కొనుగోలు చేయగలిగినవారికి కొంత ఉపశమనం లభించినా, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అదే సాధ్యం కాదు. కాబట్టి నీటి భద్రతను సామాజిక సమానత్వంతో ముడిపెట్టి చూడాలి.

హుస్సేన్‌సాగర్, మూసీ నది, నగరంలోని వందలాది చెరువులు, కుంటలు హైదరాబాద్ సహజ జలవ్యవస్థకు పునాదులు. ఒకప్పుడు వర్షపు నీటిని నిల్వ చేయడం, వరద ఉద్ధృతిని తగ్గించడం, భూగర్భ జలాలను పెంపొందించడం వంటి అనేక విధులను ఇవి నిర్వహించేవి. కానీ కాలక్రమంలో ఆక్రమణలు, కాలుష్యం, చెత్త పేరుకుపోవడం, సహజ నీటి ప్రవాహ మార్గాలు దెబ్బతినడం వల్ల అనేక జలవనరులు తమ సామర్థ్యాన్ని కోల్పోయాయి. చెరువు అనేది కేవలం నీరు నిలిచే ప్రదేశం కాదు. అది నగరానికి సహజ రక్షణ కవచం. వర్షం పడినప్పుడు నీటిని ఒడిసిపట్టి, క్రమంగా భూమిలోకి ఇంకేలా చేస్తుంది. చెరువులు కనుమరుగైతే వర్షపు నీరు వేగంగా నాలాల్లోకి, అక్కడి నుంచి బయటకు వెళ్లిపోతుంది. ఫలితంగా ఒకవైపు భారీ వర్షాలకు వరద ముప్పు పెరుగుతుంటే, మరోవైపు వర్షాలు తగ్గినప్పుడు నీటి కొరత తీవ్రమవుతుంది. వరదలు, కరువు ఒకే నగరాన్ని వెంటాడటం వెనుక సహజ జలవ్యవస్థను నిర్లక్ష్యం చేయడం కూడా ప్రధాన కారణమే. మూసీ నది పరిస్థితి సైతం ఇదే విషయాన్ని గుర్తుచేస్తోంది. ఒకప్పుడు నగర జీవనానికి ఆధారంగా నిలిచిన నది నేడు మురుగునీరు, వ్యర్థాల సమస్యను ఎదుర్కొంటోంది. నదులు, చెరువులను కాపాడుకోలేని నగరం కొత్త జలవనరుల కోసం ఎంత ఖర్చు చేసినా, దీర్ఘకాలిక నీటి భద్రతను పూర్తిగా సాధించలేదు. జలవనరుల పునరుద్ధరణను సుందరీకరణ పనులకే పరిమితం చేయకుండా, వాటి సహజ నీటి ప్రవాహాలు, నిల్వ సామర్థ్యం, పరిసర ప్రాంతాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి.

నగర విస్తరణతో భూమి ఉపరితలంపై కాంక్రీట్ నిర్మాణాలు పెరుగుతున్నాయి. వర్షపు నీరు నేలలోకి ఇంకేందుకు అవసరమైన ఖాళీ ప్రదేశాలు తగ్గిపోతున్నాయి. ఇదే సమయంలో అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలు, నిర్మాణ రంగం నీటి కోసం భూగర్భ జలాలపై ఆధారపడుతున్నాయి. ఫలితంగా బోరుబావులు మరింత లోతుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోయినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. అయితే ప్రాంతాలవారీగా పరిస్థితులు మారుతుంటాయి. కాబట్టి ఒకే సంఖ్యను నగరమంతటికీ వర్తింపజేయకుండా, ప్రతి ప్రాంతంలోని నీటి మట్టాలు, వర్షపాతం, బోరుబావుల వినియోగం ఆధారంగా ప్రణాళికలు రూపొందించాలి. ముఖ్యంగా ఐటీ కారిడార్, శివారు నివాస సముదాయాలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో భూగర్భ జలాల వినియోగాన్ని పర్యవేక్షించాలి. భూగర్భ జలాలు తగ్గినప్పుడు బోరు లోతు పెంచడం తాత్కాలిక పరిష్కారం మాత్రమే. భూమిలోకి నీరు చేరే మార్గాలను పునరుద్ధరించకపోతే, ఎంత లోతుకు తవ్వినా శాశ్వత భరోసా ఉండదు. ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సేకరణ, చెరువుల పునరుద్ధరణ, నీరు భూమిలోకి ఇంకే ప్రదేశాల పరిరక్షణ.. ఇవన్నీ ఒక సమగ్ర ప్రణాళికలో భాగం కావాలి.

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, రుతుపవనాల అనిశ్చితి నీటి లభ్యతను మరింత సంక్లిష్టంగా మార్చగలవు. అయితే ఎల్‌నినో ఉందంటే తప్పనిసరిగా వర్షాభావమే వస్తుందని భావించడం సరికాదు. వర్షపాతం ఎలా ఉండబోతోందన్నది వాతావరణ అంచనాలు, ప్రాంతీయ పరిస్థితుల ఆధారంగా నిరంతరం సమీక్షించాలి. అదే సమయంలో వర్షాలు తగ్గే అవకాశాన్ని విస్మరించకుండా ముందస్తు సంసిద్ధత కలిగి ఉండాలి. సాధారణంగా కురవాల్సిన వర్షపాతం కంటే తక్కువ వర్షాలు నమోదైతే, దాని ప్రభావం చెరువుల నింపుదల నుంచి భూగర్భ జలాల పునరుద్ధరణ వరకు కనిపిస్తుంది. ఈ పరిస్థితుల్లో నీటి నిల్వలను సమర్థంగా వినియోగించడం, సరఫరాలోని నష్టాలను తగ్గించడం, తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వడం అత్యవసరం. వర్షాలు కురిసిన తర్వాతే చర్యలు ప్రారంభించడం కాకుండా, వర్షాభావ పరిస్థితులు ఏర్పడకముందే ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధంగా ఉండాలి. హైదరాబాద్ భవిష్యత్తు విస్తరణను కూడా ఇదే కోణంలో చూడాలి. మహానగర పరిధి విస్తరించడం, కొత్త పారిశ్రామిక ప్రాంతాలు, నివాస సముదాయాలు, ప్రతిపాదిత భవిష్యత్ నగర ప్రాజెక్టులు రూపుదిద్దుకోవడం వల్ల రాబోయే పదిహేనేళ్లలో నీటి అవసరాలు మరింత పెరగవచ్చు. కొత్త ప్రాంతాలకు అనుమతులు ఇచ్చే ముందు అక్కడి నీటి లభ్యత, వర్షపు నీటి సేకరణ, మురుగునీటి శుద్ధి, భూగర్భ జలాల పునరుద్ధరణకు సంబంధించిన స్పష్టమైన ప్రణాళిక ఉండాలి. నీటి వనరుల సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా నగర విస్తరణకు అనుమతిస్తే, భవిష్యత్తులో ఆ భారాన్ని ప్రజలే భరించాల్సి వస్తుంది.

హైదరాబాద్‌కు అదనపు నీటి వనరులు అవసరమయ్యే అవకాశాన్ని కొట్టిపారేయలేం. కానీ కొత్త ప్రాజెక్టుల ద్వారా సరఫరా పెంచడమే ఏకైక పరిష్కారం కాదు. ముందుగా ప్రస్తుతం సరఫరా అవుతున్న నీటిలో ఎంత వృథా అవుతోంది? పైపులైన్ల లీకేజీల వల్ల ఎంత నష్టం జరుగుతోంది? శుద్ధి చేసిన మురుగునీటిని ఎంతవరకు తిరిగి వినియోగించవచ్చు? అనే అంశాలపై సమగ్ర పరిశీలన జరగాలి. నగరంలో తాగునీటిని తాగడానికి, వంటకు మాత్రమే కాకుండా తోటల పెంపకం, వాహనాల శుభ్రత, నిర్మాణ పనులు, పరిశ్రమల అవసరాల కోసం కూడా వినియోగించడం జరుగుతోంది. ఈ అవసరాలన్నింటికీ శుద్ధి చేసిన తాగునీటినే ఉపయోగించాల్సిన అవసరం లేదు. మురుగునీటిని శాస్త్రీయంగా శుద్ధి చేసి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పరిశ్రమలు, ఉద్యానవనాలు, నిర్మాణ రంగం వంటి తాగునీరేతర అవసరాలకు అందించాలి. అయితే నీటి పొదుపు పేరుతో బాధ్యతను పూర్తిగా ప్రజలపైకి నెట్టడం సరికాదు. సరఫరా వ్యవస్థలోని లోపాలను సరిచేయడం, లీకేజీలను గుర్తించడం, నీటి నాణ్యతను పర్యవేక్షించడం, అక్రమ వినియోగాన్ని నియంత్రించడం ప్రభుత్వ సంస్థల బాధ్యత. ప్రతి ప్రాంతంలో నీటి సరఫరా, వినియోగం, నిల్వలు, భూగర్భ జలమట్టాలకు సంబంధించిన వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. నీటి లెక్కలు పారదర్శకంగా ఉన్నప్పుడే సమస్య ఎక్కడ ఉందో గుర్తించి పరిష్కారాలు అమలు చేయడం సాధ్యమవుతుంది.



రామకృష్ణ గోగులమూడి
పొలిటికల్ సైన్స్, ఉస్మానియా యూనివర్సిటీ

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811.
Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039.
PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.